అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 09 సంచిక :102 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: శుక్రవారం 14-06-2024 పేజీలు:4 వెల: 2.00

## నంద్యాల జిల్లాలో చిరుత దాడి.. మహిళకు తీవ్రగాయాలు

అమరావతి : నంద్యాల జిల్లాలో రైల్వే కూలీలపై చిరుత దాడి చేసిన ఘటనలో ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి . మహానంది మండలం గాజులపల్లె శివారు చలమ ప్రాంతంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 20 మంది రైల్వే కూలీలు పనులు చేస్తున్నారు. గురువారం కూలీలు పనిచేస్తుండగా పొదల నుంచి వచ్చిన చిరుత కూలీలపై దాడి చేసింది. ఈ దాడిలో పాండవ్ అనే మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను సహచర కూలీలు హుటాహుటినా ఆస్పత్రికి తరలించారు.



## ఆ పాఠ్యపుస్తకాలు వెనక్కి తీసుకోండి.. విద్యాశాఖ ఆదేశాలు

హైదరాబాద్: కాంగ్రెస్ సర్కార్ ముందుచూపులేకుండా చేస్తున్న పనుల వల్ల ప్రజలపై పెనుభారం పడుతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఇన్నాళ్లు తాత్సారం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. తీరా వర్షాలు ప్రారంభమైన తర్వాత ఆగమేఘాల మీద మరమ్మతుల చేయిస్తున్నది. తాజాగా పాఠశాల పుస్తకాల పంపిణీలో కూడా అదేవిధమైన పొరపాట్లు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ బడులకు వచ్చిన విద్యార్థులకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్‌లు పంపిణీ చేశారు. అయితే వాటిని విద్యార్థుల నుంచి వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. విద్యాశాఖ వాటిలో ముందుమాట మార్చకుండా ముద్రించింది. ఇదికాస్త వివాదాస్పదం కావడంతో వాటిని వెనక్కి తీసుకోవాలని ఆదేశించింది. ఒకటి నుంచి పదో తరగతి వరకు టెక్స్ట్ బుక్స్‌ను వాపస్ తీసుకోవాలని పేర్కొంది. అయితే మళ్లీ వాటిని ఎప్పుడు పంపిణీ చేస్తారనే విషయమై స్పష్టతనివ్వలేదు. ఇప్పటికే విద్యార్థులకు



యూనిఫామ్‌ను ఒక్క జతకే పరిమితం చేసిన ప్రభుత్వం.. తాజాగా ఇచ్చిన పుస్తకాలను వెనక్కి తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ అనాలోచిత చర్యల వల్ల ఇటు విద్యార్థులు, అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

## రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు..!

హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించిన నేపథ్యంలో మరో మూడురోజులు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నెల 5న మహబూబ్‌నగర్ నుంచి తెలంగాణలోకి ప్రవేశించిన రుతుపవనాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయని వెల్లడించింది. రాగల 24 గంటల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. బుధవారం ఉమ్మడి నల్లగొండ, ఆదిలాబాద్, ఖమ్మం, మెదక్, వరంగల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసినట్లు తెలిపింది.కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్,నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులలాంబ గద్వాల జిల్లాల్లో గురువారం,



కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్‌భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శుక్రవారం వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.

## దేశంలో సరిపోను విద్యుత్తు అందుబాటులో ఉంది: మంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ: కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి ఇవాళ మీడియాతో మాట్లాడారు. దేశంలోని అన్ని ప్రదేశాల్లో కావాల్సినంత విద్యుత్తు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. గతంలో బొగ్గు కొరత వల్ల, అవసరానికి తగినట్లు విద్యుత్తు అందుబాటులో లేదని, రాబోయే అయిదేళ్లలో సంకల్ప పాత్రలో చేసిన వాగ్దానాలను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ తరం కోసం పట్టుదల, దీక్ష, క్రమశిక్షణో పనిచేయనున్నట్లు మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. బొగ్గు మంత్రిత్వ శాఖకు ఇవాళ ఛార్జ్ తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో ప్రధాని మోదీ ఆదేశాల మేరకు ప్రహ్లాద్ జోషీ, పీయూష్ గోయల్ .. బొగ్గు శాఖ మంత్రులుగా చేశారన్నారు. కమర్షియల్, డొమస్టిక్, వ్యవసాయానికి చెందిన కరెంటు కొరత లేదన్నారు.




## పోక్సో కేసులో యెడియూరప్పను అరెస్టు చేయొచ్చు : కర్ణాటక హోం మంత్రి

బెంగళూరు : కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యెడియూరప్పకు పోక్సో కేసులో సీఐడీ బుధవారం నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో యెడియూరప్పను సీఐడీ అరెస్టు చేసే అవకాశం ఉందని కర్ణాటక హోం మంత్రి జి పరమేశ్వర గురువారం పేర్కొన్నారు. దీనిపై సీఐడీ నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం యెడియూరప్ప ఢిల్లీలో ఉండడంతో జూన్ 17వ తేదీన సీఐడీ ముందు హాజరవుతానని పేర్కొన్నారు. 17 ఏళ్ల మైనర్ బాలికను లైంగికంగా వేధించినట్లు ఆయనపై మార్చిలో కేసు నమోదైంది. ఫిబ్రవరి 2న ఓ సమావేశంలో ఆయన ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని బాధితురాలి తల్లి ఫిర్యాదు చేశారు. అయితే తన బిడ్డను యెడియూరప్ప బలవంతంగా ఓ గదిలోకి లాక్కెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో యెడియూరప్పపై పోక్సో కేసు నమోదైంది. బాధితురాలి తల్లి ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతూ ఇటీవలే చనిపోయారు. ఈ కేసులో ఇప్పటికే బాధితురాలితో



పాటు ఆమె తల్లి వాంగ్మూలాన్ని సీఐడీ అధికారులు నమోదు చేశారు.

## నీట్ పరీక్షలో 1563 మంది విద్యార్థుల గ్రేస్ మార్కులు రద్దు.. సుప్రీంకు తెలిపిన కేంద్రం

దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష నీట్ యూజీ 2024 పరీక్షల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. నీట్ ఫలితాల్లో 1,563 మంది అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులను ) తొలగిస్తామని సుప్రీంకోర్టుకు తెలియజేసింది. వారికి మళ్లీ పరీక్ష రాసే అవకావం కల్పిస్తామని తెలిపింది.%ఈ ఏడాది జరిగిన నీట్ పరీక్షలో 1563 మంది విద్యార్థులకు అదనంగా గ్రేస్ మార్కులు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై విద్యార్థి సంఘాలు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశాయి. నీట్ పరీక్ష నిర్వహణ, ఫలితాల్లో అవకతవకలపై సీబీఐచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశాయి. హరియాణాలోని ఒకే పరీక్ష కేంద్రం నుంచి 67 మంది విద్యార్థులు 1వ ర్యాంకు సాధించారని, ఇది అవకతవకలు జరిగిందనడానికి నిదర్శనమని పేర్కొన్నాయి. అయితే, %చీజజు=ు% పాఠ్యపుస్తకాల్లో మార్పులు, పరీక్షా కేంద్రాల వద్ద సమయం కోల్పోవడంతో ఇచ్చిన గ్రేస్ మార్కుల వల్లే పలువురు విద్యార్థులు అధికంగా మార్కులు సాధించడానికి కారణాలని ఎన్టీయే డీజీ సుబోధ్‌కుమార్ స్పష్టం చేశారు. మరోవైపు అవకతవకల ఆరోపణలపై స్పందించి కేంద్ర విద్యాశాఖ గతవారం నలుగురు సభ్యులతో కూడిన కమిటీని వేసింది. ఈ కమిటి గ్రేస్ మార్కులు పొందిన విద్యార్థులపై విచారణ జరిపి నివేదిక సమర్పించింది. ఈ కమిటీ నిర్ణయాలను కేంద్రంగురువారం సుప్రీంకోర్టు కు తెలియజేసింది.

పరీక్ష సమయంలో కోల్పోయిన సమయం వల్ల గ్రేస్ మార్కులు పొందిన 1563 మంది విద్యార్థుల స్కోర్ కార్డులను రద్దు చేయాలని కమిటీ నిర్ణయించింది. వారికి రీ-టెస్ట్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తాం. జూన్ 23న పరీక్ష నిర్వహించి ఈ నెల 30వ తేదీలోగా వారి ఫలితాలను ప్రకటిస్తాం. ఆ తర్వాతే కౌన్సెలింగ్ ఉంటుంది. ఒకవేళ మళ్లీ పరీక్ష రాయకూడదని అనుకునే వారు.. గ్రేస్ మార్కులు లేకుండా ఒరిజినల్ మార్కులతో జులై 6 నుంచి ప్రారంభమయ్యే కౌన్సెలింగ్‌కు వెళ్లొచ్చు' అని సుప్రీం కోర్టుకు కేంద్రం వెల్లడించింది.మరోవైపు నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది. వెబ్ కౌన్సెలింగ్‌పై స్టే ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. కౌన్సెలింగ్ యథావిధిగా ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఈ పిటిషన్లపై రెండు వారాల్లోగా సమాధానం చెప్పాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కి నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను జులై 8కి వాయిదా వేసింది. ఈ ఏడాది నీట్ ప్రవేశ పరీక్ష మే 5న దేశవ్యాప్తంగా జరిగిన వదిషయం తెలిసిందే. దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. అయితే, 2019 నుంచి ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఏకంగా 67 మందికి 720కి 720 మార్కులు రావడం, టాపర్లుగా నిలవడంతో నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు మొదలయ్యాయి. ఇప్పటివరకు నీట్ యూజీలో ఒక్కసారి కూడా ముగ్గురికి మించి టాపర్లు లేరు. 2019, 2020లో ఒక్కొక్కరు చొప్పున టాపర్లుగా నిలిచారు. 2021లో ముగ్గురు, 2022లో ఒక్కరు, 2023లో ఇద్దరు టాప్ స్కోరు సాధించారు. కానీ, ఈసారి అసాధారణ రీతిలో 67 మంది టాపర్లుగా నిలవడం, వీరిలో హర్యానాలో ఒకే సెంటర్‌లో పరీక్ష రాసిన ఆరుగురు ఉన్నారనే వార్తలు రావడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అనుమానాలు మొదలయ్యాయి.

## కేంద్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్



న్యూఢిల్లీ: కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి , బండి సంజయ్ బాధ్యతలు స్వీకరించారు. ప్రత్యేక పూజల మధ్య ఇరువురు బాధ్యతలు స్వీకరించారు. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి రెండోసారి ఎంపీగా విజయం సాధించిన కిషన్ రెడ్డి.. ప్రధాని మోదీ క్యాబినెట్‌లో మరోసారి అవకాశం దక్కించుకున్నారు. ఆయనకు బొగ్గు, గనులశాఖ బాధ్యతలను ప్రధాని అప్పగించారు. ఈనేపథ్యంలో గురువారం ఉదయం తన చాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి, బాధ్యతలు చేపట్టారు. %అనంతరం మీడియాతో మాట్లాడుతూ దేశంలో విద్యుత్ లేకుండా ఏ పనీ కాదని కిషన్‌రెడ్డి అన్నారు. వ్యవసాయం నుంచి ఐటీ పరిశ్రమ వరకు ప్రజల జీవితాలు కరెంట్‌తో పెనవేసుకుని ఉన్నాయని చెప్పారు. మోదీ హయాంలో కోతలు లేకుండా విద్యుత్ అందిస్తున్నామని వెల్లడించారు. అధికంగా బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నదని, కరెంటు కోతలు లేకుండా ఉండాలంటే బొగ్గు ఉత్పత్తి పెంచాలన్నారు. మనం ఇతర దేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకుంటున్నామని, రానున్న రోజుల్లో దానిని తగ్గించి దేశీయంగా ఉత్పత్తి పెంచుతామన్నారు. ఖనిజాల అన్వేషణ, తవ్వకాల ద్వారా ఉపాధి కల్పనకు కృషి చేస్తామని వెల్లడించారు. ఇక కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కూడా కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. రెండోసారి ఎంపీగా విజయం సాధించిన ఆయనకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా మోదీ సర్కార్‌లో అవకాశం దక్కింది. ఈ మేరకు తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు.

## మసకబారిన అంతర్జాతీయ ఇమేజ్‌ను కాపాడుకునేందుకే జీ7 సదస్సుకు మోదీ : జైరాం రమేష్

మసకబారిన తన అంతర్జాతీయ ఇమేజ్‌ను కాపాడుకునేందుకే ప్రధాని నరేంద్ర మోదీ జీ7 సదస్సుకు హాజరవుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ అన్నారు. 2007లో ఇదే సదస్సుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ వెళ్లిన విషయాన్ని ప్రస్తావిస్తూ మోదీ దిగజారిన తన అంతర్జాతీయ ప్రతిష్టను కాపాడుకునేందుకే ఈ సదస్సుకు వెళుతున్నారని చెప్పారు. %నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ విషయ పరిజ్ఞానంతో గ్లోబల్ సౌత్ వాణిని వినిపించే నేతగా ఎదిగారని, సొంత డబ్బా కొట్టుకోవడం ద్వారా కాదని మోదీని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ జీ7 సదస్సులో పాల్గొనేందుకు గురువారం ఇటలీ వెళుతున్నారు. మోదీ వరుసగా మూడోసారి దేశ ప్రధానిగా పాలనా పగ్గాలు స్వీకరించిన అనంతరం చేపట్టిన తొలి విదేశీ పర్యటన ఇదే కావడం గమనార్హం. 1970ల నుంచి అమెరికా, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, బ్రిటన్, జపాన్ దేశాధినేతలతో జీ7 భేటీ జరుగుతోందని, 2003 నుంచి జీ7 సదస్సులకు భారత్, చైనా, బ్రెజిల్, మెక్సికో, దక్షిణాఫ్రికాలను కూడా ఆహ్వానిస్తున్నారని జైరాం రమేష్ గురువారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.జూన్ 2007లో జర్మనీలో జరిగిన జీ7 సదస్సులో ప్రపంచ వాతావరణ మార్పులపై మన్మోహన్



సింగ్, జర్మనీ ఛాన్సలర్ ఏంజిలా మెర్కెల్ ఫార్ములా చారిత్రాత్మకమైనదిగా పేరొందిందని కాంగ్రెస్ నేత గుర్తుచేశారు. మసకబారిన తన అంతర్జాతీయ ప్రతిష్టను మెరుగుపరుచుకునేందుకు జీ7 సదస్సుకు వెళుతున్న ప్రధాని మోదీ నుంచి ఈ ఘన చరిత్రను అంగీకరించడాన్ని ఆశించలేమని వ్యాఖ్యానించారు.

## ఈ నెల 22న 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం

వస్తు, సేవల పన్ను కు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే జీఎస్టీ కౌన్సిల్ సమావేశం ఈ నెలలో నిర్వహించనున్నారు. జూన్ 22వ తేదీన న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఆయా రాష్ట్రాలకు చెందిన ఆర్థిక మంత్రులు హాజరుకానున్నారు. ఈ విషయాన్ని జీఎస్టీ కౌన్సిల్ ట్విట్టర్ (ఎక్స్) ద్వారా వెల్లడించింది. అయితే, ఈ భేటీలో ఏయే అంశాలపై చర్చించనున్నారో మాత్రం వెల్లడించలేదు. %గతేడాది అక్టోబర్ 7న చివరిసారిగా జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఆ సమావేశంలో క్యాసినో, గుర్రపు పందేలు, ఆన్‌లైన్ గేమింగ్‌కు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ తర్వాత జరగాల్సిన కౌన్సిల్ మీటింగ్‌ను.. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకూ వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో కేంద్రంలో ఇటీవలే కొత్త ప్రభుత్వం ఏర్పడిన విషయం




తెలిసిందే. కేంద్ర ఆర్థిక మంత్రిగా మరోసారి నిర్మలా సీతారామన్ బాధ్యతలు చేపట్టారు. దీంతో తదుపరి కౌన్సిల్ మీటింగ్‌ను నిర్వహించనున్నారు.

## ఇంద్రకీలాద్రిని దర్శించుకున్న ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి : ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు తొలిసారిగా విజయవాడలోని ఇంద్రకీలాద్రి అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం తిరుమల లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న సీఎం మధ్యాహ్నం ఇంద్రకీలాద్రిని సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి నారా లోకేష్, సతీమణి బ్రాహ్మణి, మనువడు దేవాన్సు దర్శించుకున్నారు.

అనంతరం తిరుచనూరులోని పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీఎంగా విజయవాడకు వచ్చిన సందర్భంగా తొలిసారి గన్నవరం ఎయిర్‌పోర్టులో టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు , దేవదాయ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఆలయ ఈవో తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఇంద్రకీలాద్రిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు చంద్రబాబు



కుటుంబ సభ్యులకు తీర్థప్రసాదాలు అందజేసి శాలువాలతో సత్కరించారు.

## డీఎస్సీ దరఖాస్తుదారులకు అలర్ట్.. ఎడిట్ ఆప్షన్ అవకాశం ఇచ్చిన విద్యాశాఖ

హైదరాబాద్ : నిన్న టెట్ 2024 ఫలితాలు విడుదలైన నేపథ్యంలో డీఎస్సీ దరఖాస్తులను విద్యాశాఖ అప్రమత్తం చేసింది. టెట్ స్కోర్‌తో పాటు ఇతర వివరాలను ఎడిట్ చేసుకునేందుకు విద్యాశాఖ అవకాశం కల్పించింది. టెట్-2024లో అర్హత సాధించిన వారికి ఒకసారి డీఎస్సీ పరీక్షకు ఉచితంగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే.

%టెట్ పేపర్ -1లో 57,725 (67.13%), పేపర్ -2లో 51,443 (34.18%) మంది అభ్యర్థులు అర్హత సాధించారు. పేపర్1కు 85,996 మంది, పేపర్2 పరీక్షకు 1,50,491 మంది అభ్యర్థులు హాజరయ్యారు. నిరుడు టెట్‌తో పోల్చితే ఉత్తీర్ణత శాతం పెరగడం విశేషం. పేపర్ -1లో ఏకంగా 30.24శాతం, పేపర్ -2లో 18.88శాతం ఉత్తీర్ణతశాతం పెరిగినట్టు అధికారులు వెల్లడించారు. కాగా, అర్హత సాధించని అభ్యర్థులకు ప్రభుత్వం ఉపశమనం ఇచ్చింది. టెట్ -24లో అర్హత సాధించని దరఖాస్తుదారులకు డిసెంబర్ టెట్‌కు ఉచితంగా దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు కల్పించింది. టెట్-24లో అర్హత సాధించిన వారికి ఒకసారి డీఎస్సీ పరీక్షకు ఉచితంగా దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించింది. టెట్ మెమోలను https:schooledu.telangana.gov. in% వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు అధికారులు తెలిపారు.

సర్కారు బడుల్లో టీచర్లుగా పనిచేస్తున్న పలువురు టీచర్లు టెట్ పరీక్షను గట్టెక్కలేకపోయారు. తొలిసారిగా రాష్ట్రంలో 33వేలకు మందికిపైగా టీచర్లు టెట్ రాశారు. వీరిలో 18వేల మంది (54%) మాత్రమే టెట్ క్వాలిఫై అయ్యారు. ఏకంగా 15వేల (46%) మంది టీచర్లు అర్హత సాధించకపోవడం గమనార్హం. సబ్జెక్టులవారీగా చూస్తే అత్యధికంగా పేపర్ -2 సోషల్‌లో 56 శాతం టీచర్లు, పేపర్ -2 గణితం, సైన్స్‌లో 49 శాతం, పేపర్ -1లో మరో 21శాతం టీచర్లు అర్హత సాధించలేదు. టీచర్లు టెట్‌లో క్వాలిఫై కాలేదు. టెట్ పరీక్షలను గత మే 20 నుంచి జూన్ 2 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో నిర్వహించిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సీఎంవో కార్యదర్శి మాణిక్‌రాజ్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తదితరులు పాల్గొన్నారు.

**సంపాదకీయం**

**శుక్రవారం 14-06-2024**

# ప్రజలపై భారం న్యాయమా?

ఎన్నికలు వస్తే చాలు నాయకులు అధికారమే పరమావధిగా ప్రజలకు ఇష్టారీతిన హామీలు ఇవ్వడం షరామామూలైంది. తీరా అధికారం చేజిక్కిన తర్వాత ఇచ్చిన హామీలను అటకెక్కించటం ఆధునిక నాయకులలో గమనిస్తున్నాం. వారికి ఒక నిర్దిష్టమైన ఆర్థిక విధానం అంటూ లేకుండా అయితే అప్పులు చేస్తూ, లేకుంటే ధరలు పెంచుతూ ప్రజలను నయవంచనకు గురిచేస్తున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు అసాధ్యమైన ఆరు గ్యారెంటీల్లో భాగంగా 13 హామీలను 100 రోజుల్లో అమలు చేస్తానని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ముఖ్యంగా రైతుల ఓట్లను కొల్లగొట్టేందుకు 'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ చేస్తాం' అని హామీ ఇచ్చింది. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. 2 నెలల్లోనే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఎన్నికల కోడ్ సాకుగా చూపిన రేవంత్‌రెడ్డి సర్కార్ రుణమాఫీ అమలుపై మరింత కాలయాపన చేసింది. పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు రుణమాఫీ మళ్లీ తెరపైకి తెచ్చింది. వచ్చే ఆగస్టు 15వ తేదీ లోగా ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసితీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల సాక్షిగా ప్రమాణాలు కూడా చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసింది. హామీల అమలు కోసం ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తారని ముందే గ్రహించిన కాంగ్రెస్ ప్రభుత్వం పలు కొత్త విధానాలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో ఇప్పటికే చెలామణిలో ఉన్న మద్యం పాలసీలో కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టింది. ఒక్కో బాటిల్ మీద రూ.80 నుంచి రూ.100 వరకు వచ్చేవిధంగా ప్రణాళికలను రూపొందించింది. అంతేకాదు, భూముల మార్కెట్ విలువను పెంచి రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా భారీగా పెంచేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రెండేండ్ల కిందటే పెరిగిన అద్దె విలువను మళ్లీ పెంచి ఏడాదికి 20 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. రేవంత్ సర్కారు వికృత చేష్టలు పేద, మధ్య తరగతి ప్రజలపై అధిక భారాన్ని మోపుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం పదేండ్లలో అధికారం ఉన్న కేసీఆర్ తొలి ఐదేండ్లలో కాళేశ్వరం లాంటి బృహత్తరమైన ఎత్తిపోతల పథకం, కరెంటు స్థిరీకరణ కోసం యాదాద్రి థర్మల్ విద్యుత్తు ప్రాజెక్టులను నిర్మించారు. రాష్ట్రంలోని ప్రముఖ వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను చక్కదిద్ది కరువు కాటకాలకు పేరుగాంచిన తెలంగాణ వ్యవసాయాన్ని దేశంలోనే అత్యధిక వరి పంట దిగుబడి వచ్చే జాబితాలో రెండవ స్థానంలో నిలిపారు. తెలంగాణను ధాన్యాగారానికి చిరునామాగా మార్చారు. విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపే ప్రాజెక్టులతో పాటు దగాపడ్డ తెలంగాణ ప్రజల బతుకుల్లో వెలుగులు నింపారు. కానీ, రుణాన్ని అప్పుల మయం, కేసీఆర్‌ను బదనాం చేసేందుకు కాంగ్రెస్, బీజేపీలు పోటీపడ్డాయి. మరి నాడు కేసీఆర్ అప్పులు చేసి తెలంగాణను ఆగం చేసిందని బద్నాం చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. వచ్చిన మూడు నెలలకే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.18,100 కోట్ల అప్పులు ఎందుకు చేయాల్సి వచ్చిందో ప్రజలకు చెప్పాలి. అవగాహన లేమితో అలవికాని హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలు కోసం నానా తంటాలు పడుతోంది. అందుకే ఆదాయ మార్గాల అన్వేషణలో పడింది. అందులో భాగంగానే మద్యం రేట్లను పెంచడం, భూములు వసూలు చేయడం వంటి చర్యలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేసేందుకు ధరలను పెంచుతూ ప్రజలపై భారం మోపుతోంది. రేవంత్ సర్కార్ అవలంబిస్తున్న ఈ విధానం సరైనది కాదు. అంతేకాదు, ఆగస్టు 15 వరకు రేవంత్‌రెడ్డి సర్కార్ ఎట్టి పరిస్థితుల్లోనూ రుణమాఫీని అమలు చేయాల్సి ఉంది. దానికి సరిపడా నిధుల సేకరణలో భాగంగా ప్రజలపై భారం మోపేందుకు రేవంత్ రెడ్డి సర్కారు సన్నాహాలు చేస్తోంది. ఈ విధమైన చర్యలకు పాల్పడితే రేవంత్ సర్కార్ ప్రజాగ్రహానికి గురికాదు. అవగాహన లేమితో, అధికారం అనుభవించాలంటే ఆరాతో కాంగ్రెస్ పార్టీ అలవికానీ హామీలు ఇచ్చిందనే వాస్తవం ప్రజలకు మెల్లిగా అర్థమవుతోంది. ఆ హామీలను నెరవేర్చేందుకు ప్రజల నెత్తిపైనే భారం వేస్తామంటే తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన సమయంలో, సరైన రీతిలో బుద్ధి చెప్పారు.

# సామాజిక కూర్పుతో అఖిలేశ్ సక్సెస్



యూపీ:'కేంద్ర ప్రభుత్వానికి దారి ఉత్తర్‌ప్రదేశ్ మీదుగా పోతుంది' అనేది భారత రాజకీయాల్లో పాతుకుపోయిన నానుడి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ చాలాకాలం యూపీలో మెజారిటీ సీట్లు కైవసం చేసుకున్న పార్టీలే దేశంలో ఆధిపత్యం చెలాయించేవి. అయితే ఈసారి కూడా యూపీలో ఎక్కువ సీట్లు ఆశించిన బీజేపీ పార్టీకి ఊహించని పరాభవం ఎదురైంది. అఖిలేశ్ యాదవ్ చేసిన 'సామాజిక కూర్పు'తో ఆ పార్టీ యూపీలో డీలా పడింది. మొత్తం 543 లోక్‌సభ స్థానాల్లో యూపీలో 80 సీట్లుండగా ఉత్తరాఖండ్ అవతరణకు ముందు 85 ఉండేవి. పాతిక కోట్ల జనం ఉన్న యూపీలో గత పదేండ్లలో తిరుగులేని ఆధిపత్యం సాధించిన బీజేపీ 2024 ఎన్నికల్లో చతికలపడింది. 2014, 2019 పార్లమెంటు ఎన్నికల్లో సొంతంగా వరుసగా 71, 62 స్థానాలను కాషాయపక్షం గెలుచుకుంది. 18వ లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ బలం రాష్ట్రంలో 33 సీట్లకు పడిపోయింది. ఎన్డీయే భాగస్వామ్యపక్షం అప్నాదళ్‌కు ఒక సీటు లభించింది. రాష్ట్రంలో బీజేపీ బలం 2019 నాటికి 9 సీట్లు తగ్గిపోగా, 2014తో పోల్చితే ఇప్పుడు 38 సీట్లు తగ్గాయి. గతంలో అటల్ బిహారీ వాజపేయి ప్రధానిగా ప్రస్తుతం బీజేపీ ప్రజాకీర్ణ ప్రభుత్వాలు నడిచిన మూడు సందర్భాల్లోనూ బీజేపీ యూపీలో రెండు మెజారిటీ సీట్లు దక్కాయి. 1996, 98, 99లో బీజేపీకి యూపీలో వరుసగా 52, 57, 29 సీట్లు లభించాయి. 2004లో అధికారం కోల్పోవడానికి ఐదేండ్ల ముందు జరిగిన 1999 మధ్యంతర ఎన్నికల నాటికి బీజేపీ యూపీలో బలహీనమైందని ఈ లెక్కలు చెప్తున్నాయి. రాష్ట్రంలో 10, రాష్ట్రంలో 7 ఏండ్ల కాషాయ పాలనతో బలహీనమైన బీజేపీ: బీజేపీ బలం 2014 నాటి 71 నుంచి 33 సీట్లకుజారడానికి రాష్ట్రంలో అత్యంత బలమైన ప్రాంతీయ పక్షం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య పొత్తు ఒక్కటే కారణం కాదు. బీజేపీ అధికారిక పదేండ్లుగా, ఏడేండ్లుగా యూపీలో కొనసాగుతున్న పాలనపై జనంలో ఉప్పొంగిన వ్యతిరేకత కాషాయపక్షాన్ని కుంగదీసింది. బీజేపీ 'హిందుత్వ' అజెండాకు కేంద్రబిందువైన అయోధ్యలోనే (ఫైజాబాద్ సీటు) ఎస్పీ అభ్యర్థి అవధేశ్ ప్రసాద్ చేతిలో బీజేపీ అభ్యర్థి లల్లూసింగ్ ఓటమి పాలు కావడం కాషాయపక్షం బలహీనతకు అద్దం పడుతోంది. రెండు ఎన్నికల్లో వరుసగా గెలిచిన లల్లూసింగ్‌ను దళితుడైన అవధేశ్ 55 వేల ఓట్ల తేడాతో ఓడించడం నిజంగా గొప్ప సంచలనం. ఈ ఎన్నికల్లో ఎస్పీకి అత్యధికంగా 37, దాని మిత్రపక్షం కాంగ్రెస్‌కు 6 సీట్లు లభించాయి. అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగిన ఏడాదే ఇక్కడ బీజేపీ ఎదురుదెబ్బలు తినడం, రాష్ట్రంలో దాని ఎంపీ సీట్లు 2014 ఫలితాలతో పోల్చితే సగానికి పైగా తగ్గిపోవడం మారుతున్న గాలికి సంకేతం. బీఎస్పీతో పొత్తుపెట్టుకున్న ఎస్పీ అఖిలేశ్‌యాదవ్ ఈసారి కాంగ్రెస్‌కు 17 సీట్లు ఇచ్చి 62 సీట్లలో పోటీ చేయడమేగాక (ఒక సీటులో తృణమూల్ అభ్యర్థికి మద్దతు) అభ్యర్థుల ఎంపిక మొదలు అనేక ప్రయోగాలు చేశారు. 'అగ్నివీర్' పథకంపై వ్యతిరేకత, పెరుగుతున్న నిరుద్యోగం వంటి సమస్యలతో పాటు ఎస్పీ అభ్యర్థుల సామాజిక కూర్పు (సోషల్ ఇంజినీరింగ్) బీజేపీ ఓటమికి దారితీశాయి. తాను అధికారంలో ఉన్నప్పటి విధానాలు, గత ఎన్నికల్లో టిక్కెట్లు కేటాయించిన తీరు వల్ల యూపీలో ఎంవై (ముస్లింలు, యాదవుల) పార్టీ అని ముద్రపడిన ఎస్పీ ఇమేజిని యూపీ మాజీ సీఎం అఖిలేశ్ కొత్త సామాజిక కూర్పుతో మార్చివేసే ప్రయత్నంలో సఫలమయ్యారు. తన 62 సీట్లలో ఓబీసీలకు 32, దళితులకు 16, అగ్రవర్ణాలకు 10, ముస్లింలకు 5 సీట్లు ఇచ్చారు. దాదాపు పది పన్నెండు ఎంపీ సీట్లు యాదవులకు కేటాయించే ఆనవాయితీకి అఖిలేశ్ స్వస్తి చెప్పి ఈసారి ఐదు టికెట్లు ఇవ్వడం అభిలషణీయ మార్పు. 'పిఛడే దళిత్ అల్ప సంఖ్యక్' (పీడీఏబీసీ, ఎస్సీ, మైనారిటీ)అనే నినాదంతో ఈ వర్గాలను ఆకట్టుకోవడం ద్వారా బీజేపీ పాలక ద్వయం నరేంద్ర మోదీ, అమిత్ షా ఇప్పటిదాకా కొనసాగుతున్న యాదవేతర బీసీలు, జాటవేతరమాయవతి కులమైన చర్మకారుల పేర్ల జాతవులు) ఎస్సీల వ్యూహాన్ని తిప్పికొట్టగలిగారు. 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీచేసిన ఎస్పీ, కాంగ్రెస్ మధ్య ఓట్ల బదిలీ జరగలేదు. పొత్తు విఫలమైంది. ఈసారి ఓట్ల బదిలీ రెండు పక్షాల మధ్య సజావుగా జరిగి కూటమి విజయానికి సహకరించింది. బీసీల్లో బాగా వెనుకబడిన కులాలవారికే గాక, అన్నివిధాలా పైకొచ్చిన బీసీ కుర్మీలకు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఎస్పీ టికెట్లు లభించాయి. కేవలం 3.5 నుంచి 4 శాతం జనాభా ఉన్న కుర్మీలతోపాటు, మాయావతి వర్గమైన ఎస్సీ జాతులు కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఎస్పీ కాంగ్రెస్ కూటమి వైపు మొగ్గడంతో బీజేపీ రథానికి బ్రేకులు పడ్డాయి. అయోధ్య పరిధిలోకి వచ్చే ఫైజాబాద్‌లో రెండుసార్లు వరసగా గెలిచిన బీజేపీ రాజపుత్ ఎంపీ లల్లూసింగ్‌పై కోరి అనే ఎస్సీ కుటుంబంలో పుట్టిన 77 ఏండ్ల అవధేశ్ ప్రసాద్‌ను నిలబెట్టి గెలిపించడం అఖిలేశ్‌కు కలిసొచ్చిన వ్యూహం. పశ్చిమ యూపీలోని మీరట్‌లో 'రామాయణ్' సీరియల్ రాముడు అరుణ్ గోవిల్ (వైశ్యుడు)పై దళిత కుటుంబంలో పుట్టిన నగర మాజీ మేయర్ సునీతా వర్మను ఎస్పీ నిలబెట్టి దాదాపు ఓడించినంత పని చేయగలిగింది. సునీతను అరుణ్ గోవిల్ కేవలం పది వేల ఓట్ల తేడాతోనే ఓడించగలిగారు. అంటే జనరల్ స్థానాల్లో ఎస్పీ పోటీ చేసిన మోదీ దళిత అభ్యర్థులు సాధించిన విజయాలు, సీఎం యోగి ఆదిత్యనాథ్ పాలనపై యూపీ జనంలో ఉన్న వ్యతిరేకతను చాటి చెప్పడమే గాక ఉత్తరాదిన వస్తున్న రాజకీయ, సామాజిక పరిణతికి ఇవి అద్దం పడుతున్నాయి. పశ్చిమ యూపీ నిన్నమొన్నటి వరకూ బీజేపీకి కంచుకోటగా నిలిచింది. అలాంటిది అక్కడి మొత్తం 26లో బీజేపీ ఈసారి కేవలం 13 సీట్లు నిలబెట్టుకోగలిగింది. ముస్లింలు అధికంగా ఉండే ఈ ప్రాంతంలోని ఎస్సీలైన జాతవులు, వ్యవసాయకులమైన జాట్లు (జాట్‌నేత, ఆర్ఎల్డీ అధినేత జయంత్ చౌదరీతో పొత్తు ఉన్నాగానీ), రాజపుత్రులు, ఇతర కులాల ఓటర్లు బీజేపీకి దూరంగా జరిగి ఎస్పీ కూటమికి అత్యధిక స్థానాలు అందించారు. 26 మంది బీజేపీ సిటింగ్ సభ్యుల పరాజయం: ఇప్పటికే అనేకసార్లు గెలిచిన బీజేపీ సిటింగ్ సభ్యులు జనాదరణ కోల్పోవడంతో వారిలో 26 మంది ఓడిపోయారు. అభ్యర్థుల ఎంపిక కూడా బీజేపీ కొంప ముంచింది. 'డబుల్ ఇంజిన్ సర్కార్', అబ్ కీ బార్ చార్ సౌ పార్' వంటి నినాదాలు బీజేపీ డొల్లతనాన్ని బయటపెట్టాయి. నిజంగా 400 సీట్లు గెలిస్తే మోదీ సర్కార్ దేశంలో ఎస్సీ, బీసీల కోట్లు రద్దుచేస్తుందని, రాజ్యాంగం రూపురేఖలను గుర్తుపట్టలేనంతగా మార్చేస్తుందని యూపీ ప్రజానీకం భయపడి బీజేపీని పలుచోట్ల ఓడించారు. యూపీలో వరుసగా 2014, 2019 లోక్‌సభ, 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి అందించిన సంక్షేమ పథకాల గురించి ఈ ఎన్నికల్లో ఎంత ప్రచారం చేసినా ఓటర్లు ఎక్కలేదు. ముస్లిం లేదా ఇస్లాం అనే పేరెత్తకుండా బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొట్టి లబ్ధిపొందడానికి పన్నిన వ్యూహం కూడా పనిచేయలేదు. యూపీ గుర్తించిన బీజేపీ 2014 పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ ప్రధాని అభ్యర్థి మోదీని గుజరాత్ నుంచే గాక రాష్ట్రంలో వారణాసి నుంచి రంగంలోకి దింపు గత పదేండ్లుగా రాజకీయంగా ప్రయోజనం పొందింది. ఎన్నెన్నో పాత కట్టడాలు, ఇళ్లు కూలగొట్టి కాశీ విశ్వనాథ ఆలయానికి కొత్త సౌకర్యాలు సమకూర్చడంతోపాటు అయోధ్యలో బాలరాముడి గుడిని ఆరంభించినప్పటికీ వారణాసి ఎంపీగా ఉంటూ యూపీ 'ప్రధాని'గా కనపడాలని చేసిన ప్రయత్నాలు 2024లో బెడిసికొట్టాయి. ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీకి, పూర్తిగా కనుమరుగయ్యే స్థితిలో ఉన్న కాంగ్రెస్‌తో పొత్తు కన్నా కూడా బీజేపీ లోపాలు, 10 సంవత్సరాల్లో దాని బలాన్ని యూపీలో 71 నుంచి 33 ఎంపీ సీట్లకు తీసుకొచ్చారు. పశ్చిమ యూపీలోని మీరట్‌లో 'రామాయణ్' సీరియల్ రాముడు అరుణ్ గోవిల్ (వైశ్యుడు)పై దళిత కుటుంబంలో పుట్టిన నగర మాజీ మేయర్ సునీతా వర్మను ఎస్పీ నిలబెట్టి దాదాపు ఓడించినంత పని చేయగలిగింది. సునీతను అరుణ్ గోవిల్ కేవలం పది వేల ఓట్ల తేడాతోనే ఓడించగలిగారు. అంటే జనరల్ స్థానాల్లో ఎస్పీ పోటీ చేసిన మోదీ దళిత అభ్యర్థులు సాధించిన విజయాలు, సీఎం యోగి ఆదిత్యనాథ్ పాలనపై యూపీ జనంలో ఉన్న వ్యతిరేకతను చాటి చెప్పడమే గాక ఉత్తరాదిన వస్తున్న రాజకీయ, సామాజిక పరిణతికి ఇవి అద్దం పడుతున్నాయి.

# భూసార పరీక్షలతో అధిక దిగుబడి



ఇబ్రహీంపట్నం, రాష్ట్రంలో రైతులు వరికి బదులుగా ఇతర పంటలపై దృష్టి సారించాలని ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు, ప్రచారం చేస్తోంది. ముఖ్యంగా రైతులు ఆరుతడి పంటలైన కూరగాయలు, పప్పుదినుసులు సాగుచేయాలని ప్రభుత్వం కోరుతున్నందున ప్రతిరైతు తమ వ్యవసాయ పొలాలకు అనుకూలంగా పండేపంటల వివరాలను తెలుసుకునేందుకు రైతులు తమ వ్యవసాయ పొల మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకుని సాగుచేసుకున్న అధిక దిగుబడులు సాధించేందుకు ప్రతిరైతు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంతో మేలని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

రైతు తన పొలంలో అధిక దిగుబడి పొందాలన్నా రసాయన మందుల వాడకం తగ్గించాలన్నా ముందుగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. మట్టి స్వభావం తెలుసుకోవాలంటే భూమిలో ఎలాంటి పంటలు పండించుకోవాలన్నా ఏయే మందులు ఎంత మోతాదులో వాడాలో తెలుసుకోవాలన్నా పరీక్ష ఫలితాలకు అనుగుణంగా వాడితే పెట్టుబడి తగ్గడమే కాకుండా ఆశించిన దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పంటల సాగుకోసం తెలంగాణ వ్యాప్తంగా వ్యవసాయ అధికారులు భూసార పరీక్షలు నిర్వహించేందుకు మట్టి నమూనా సేకరిస్తున్నారు. భూసార పరీక్ష వల్ల కలిగే లాభాలను వివరిస్తున్నారు. యాసంగి పంటల సాగు ప్రారంభంకానున్న నేపథ్యంలో భూసార పరీక్షలకు తరుణమిదేనని అధికారులు చూస్తున్నారు. పంటలు సాగుచేసుకునే ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు.

మట్టి నమూనా సేకరించే విధానం..

రైతు తన పొలంలో ఒక ఎకరంలో కనీసం ఆరు నుంచి ఎనిమిది చోట్ల ఆంగ్ల అక్షరం వీఆకారంలో ఆరు నుంచి ఎనిమిది లోతు వరకు అంచు మట్టిని తీయాలి. సేకరించిన నమూనాలను బాగా కలిపి శుభ్రమైన గోనె సంచిలో తీసుకోవాలి. ఆ మట్టిని నీడలో పరిచిఆరబెట్టాలి. తర్వాత మట్టిని ఒక పొరగా చేసి నాలుగు భాగాలుగా విభజించాలి. మూలలకు ఎదురుగా ఉన్న మట్టిని తీసుకుని మిగిలిన మట్టిని పారేయాలి. ఇలా కనీసం అరకిలో మట్టి వచ్చే వరకు తీసుకోవాలి. ఇలా తీసుకున్న మట్టిని ఒక ప్లాస్టిక్ సంచిలో వేసి రైతుల వివరాల్లో ఉంచాలి. భూసార పరీక్షల కేంద్రానికి వ్యవసాయశాఖ అధికారి ద్వారా పంపించాలి. మట్టిని భూసార పరీక్ష పరీక్ష చేసి మట్టిలో ఉన్న లవణాలు, సేంద్రియ కర్బనాలు, నత్రజని, భాస్వరం పొటాష్‌లోని ఇతర పోషకాల స్థాయిని అధిక దిగుబడికి వాడాల్సిన ఎరువుల మోతాదును సూచిస్తారు.

భూసార పరీక్షలతో లాభాలు..

పొలాల్లోని ప్రధాన పోషకాలు, సూక్ష్మ పోషకాల స్థాయిని తెలుసుకోవచ్చు. మట్టి పరీక్షల ఫలితాలతో ఏ పంట వేయాలి. ఏ పంటకు ఏయే మందులు ఏ మోతాదులో వేయాలి. అనే విషయాలు తెలుసుకునే అవకాశం ఉంది. పంట పొలాల్లో చౌడ ఆమ్ల స్థాయిని నిర్ధారించి వాటిని తగ్గించేందుకు అవసరమైన యాజమాన్య పద్ధతులు పాటించే అవకాశం ఉంటుంది. రసాయన మందులపై అనవసర ఖర్చును తగ్గించుకునే అవకాశం ఉంటుంది.

20 నుంచి 30 రోజుల్లో ఫలితాలు..

భూసార పరీక్షకు పరీక్షించిన మట్టిని వ్యవసాయాధికారులు కేంద్రాలకు పంపుతారు. అధికారులు పంపిన తర్వాత ఇరవై నుంచి ముప్పై రోజుల్లో అన్వేషణ ఆన్‌లైన్‌లో అందజేస్తారు. దీంతోపాటు రైతుకు భూసార పరీక్షలకు సంబంధించిన ఆరోగ్యకార్డును అందజేస్తారు. ప్రస్తుతం భూసార పరీక్షల మట్టిని సేకరించి అందిస్తే కనీసం నెలరోజుల వరకు ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది. ఏటా సగం రైతులకు సంబంధించిన భూసార పరీక్షలు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే సగం మంది రైతులకు భూసార పరీక్షలు పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

రైతులు భూసార పరీక్షలు చేయించుకుని తమ వ్యవసాయ పొలాలను అనుకూలమైన పంటలను సాగుచేసేందుకు వీలు ఉంటుంది. అదేవిధంగా అధిక దిగుబడులు సాధించేందుకు సులువుగా ఉంటుంది. భూ సారాన్ని బట్టి ఎంతమేరకు మందులను వాడవచ్చనేది తెలిస్తుంది. ప్రస్తుత రైతులు వారికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్న ప్రభుత్వాలకు అనుగుణంగా తమ పొలాల్లో ఏయేపంటలు సాగుచేసుకుంటే బాగుంటుందో తెలుసుకోవడానికి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. రైతులు భూసార పరీక్షలు చేయడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చు.- సత్యనారాయణ, ఏడీఏ , వ్యవసాయ శాఖ ఇబ్రహీంపట్నం

# రాయబరేలి పర్యటనలో రాహుల్ సంచలన వ్యాఖ్య

లక్నో,ఈ ఎన్నికల్లో వారణాసి నుంచి ప్రియాంకగాంధీ పోటీ చేసి ఉంటే.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓడిపోయేవారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కనీసం రెండు, మూడు లక్షల ఓట్ల తేడాతో తన సోదరి చేతిలో పరాజయం పాలయ్యేవారని చెప్పారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో నిర్వహించిన ప్రత్యేక సభలో పాల్గొన్న రాహుల్, ప్రియాంక గాంధీలు.. లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంటులో భాజపా నేతృత్వంలోని ఎన్డీయే కూటమి బలాన్ని తగ్గించేందుకు రాయ్‌బరేలీ, అమేఠీలతోపాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో 'ఇండియా' కూటమి పార్టీలన్నీ ఐకమత్యంతో పోరాడాయి' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఎన్నికల్లో మెరుగైన ఫలితాల విషయంలో అహం ప్రదర్శించబోమని, ప్రజాప్రయోజనాల కోసం కృషి చేస్తామని తెలిపారు. అయోధ్య రామమందిర ప్రతిష్ఠాపన కార్యక్రమంలో సామాన్యులను విస్మరించి.. పారిశ్రామికవేత్తలు, ఇతర ప్రముఖులకే మోదీ ప్రాధాన్యం ఇచ్చారని.. అందుకే అక్కడ భాజపాకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు. అమేఠీ, రాయ్‌బరేలీల్లో హస్తం పార్టీకి ప్రజలు చరిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టారని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. ఈ రోజు దేశమంతా అవధ్ (అయోధ్య) వైపు చూస్తోందని.. స్వచ్ఛమైన, అంకితభావంతో కూడిన రాజకీయాలు అవసరమనే సందేశాన్ని ఈ ప్రాంతం చాటిచెప్పినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో రోజూ రెండు, మూడు గంటలు మాత్రమే నిద్రకు కేటాయించి, మిగతా సమయంలో పార్టీ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యానని చెప్పారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ శ్రేణుల సమన్వయంతోనే యూపీలో భారీ విజయాలను నమోదు చేసినట్లు చెప్పారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కంచుకోటలైన రాయ్‌బరేలీ నుంచి రాహుల్‌గాంధీ, అమేఠీ నుంచి కిశోరీలాల్ శర్మ గెలుపొందిన విషయం తెలిసిందే. అయోధ్య క్షేత్రం ఉన్న ÷జాబాద్‌లో కమలం అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ లల్లూ సింగ్‌పై ఎస్పీ దళిత నేత అవధేశ్ ప్రసాద్ విజయం సాధించారు. మరోవైపు.. యూపీలోని మొత్తం 80 స్థానాల్లో ఎస్పీ 37, కాంగ్రెస్ 6 సీట్లు సాధించాయి. భాజపా 33 స్థానాలకే పరిమితమైంది.

# స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టండి

హైదరాబాద్,తెలంగాణ వ్యాప్తంగా పాఠశాల బస్సుల ఫిట్‌నెస్‌పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను బలోపేతం చేసి చెక్ పోస్టుల వద్ద నిరంతర నిఘా ఉంచాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించేలా ప్రత్యేక ఏర్పాట్లు ఉంటేనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలని సూచించారు. మంగళవారం రవాణాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రతి స్కూల్ బస్సు తనిఖీ చేయాలని, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉంటేనే రోడ్డు ఎక్కేలా చూడాలని చెప్పారు. వారం రోజులపాటు స్కూళ్లు, కాలేజీల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. 'కారు డోర్‌లకు బ్లాక్ ఫిల్మ్ గ్లాస్ ఉన్న వాటిపై విధిగా తనిఖీలు నిర్వహించాలి. రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత బలోపేతం చేస్తే అవినీతికి ఆస్కారం లేకుండా ఆదాయం పెంచుకోవచ్చు. సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి పాలసీలో ఉన్న విధంగా వ్యవహరించాలి. వాహనాలను భద్రపర్చే ప్రదేశాలపై జిల్లా పోలీస్ అధికారులతో కో-ఆర్డినేట్ చేసుకోవాలి. హైదరాబాద్‌లో ఆటోరిక్షాలపై ప్రస్తుతం ఉన్న పాలసీతో పాటు సీఎన్జీ, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేలా రూపొందించాలి' అని అధికారులకు దిశానిర్దేశర చేశారు.

# తూర్పు ఆఫ్రికా దేశమైన మలావీలో ఘోరం

న్యూఢిల్లీ, తూర్పు ఆఫ్రికా దేశమైన మలావీ ఉపాధ్యక్షుడు సౌలోస్ చిలిమా (51) విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన భార్యతో సహా విమానంలో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది కూడా ప్రాణాలు కోల్పోయారు. మలావీ అధ్యక్షుడు లాజరస్ చక్వేరా కార్యాలయం మంగళవారం నాడు ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించింది. ఒకరోజు జాతీయ సంతాప దినంగా ప్రకటించారు. సంఘటన వివరాల ప్రకారం, మలావీ మాజీ అటార్నీ జనరల్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు చిలిమా సహా మరో తొమ్మిది మంది సైనిక విమానంలో ప్రయాణిస్తుండగా సోమవారం అదృశ్యమైంది. ప్రతికూల వాతావరణం కారణంగా ఉత్తర నగరమైన జుజులో విమానం ల్యాండ్ కావడంలో విఫలమైంది. దీంతో రాజధాని లిలాంగ్వేకి తిరిగి రావాలని సందేశం అందింది. కానీ విమానం తిరిగి రాకుండానే అదృశ్యం కావడంతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు పర్వత ప్రాంతంలో విమానం శకలాలను కనుగొన్నారు. ఒక్కరు కూడా ప్రాణాలతో బయటపడకపోవడంతో మలావీలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఇది అత్యంత హృదయవిదారకమైన సంఘటన అని, ఈ విషయం తెలియజేయడానికి విచారం వ్యక్తం చేస్తున్నానని చక్వేరా తెలిపారు. ఈ ఘటనలో ఉపాధ్యక్షుడు సౌలస్ షిలిమా సహా 10 మంది దుర్మరణం చెందినట్లు ఆ దేశాధ్యక్షుడు లాజరస్ చక్వేరా వెల్లడించారు. గల్లంతైన విమానం శకలాలను గుర్తించామని.. అందులో ఎవరూ ప్రాణాలతో లేరని తెలిపారు. మలావీ ఉపాధ్యక్షుడు, మరో తొమ్మిది మందిని తీసుకెళ్తున్న సైనిక విమానం జూన్ 10న అదృశ్యమైంది. రాజధాని లిలోంగ్వే నుంచి బయలుదేరిన ఆ విమానం 370 కిలోమీటర్ల దూరంలోని జుజు అంతర్జాతీయ విమానాశ్రయ ంలో దిగాల్సి ఉంది. ప్రయాణ సమయం 45 నిమిషాలు. అయితే, ప్రతికూల వాతావరణం కారణంగా అక్కడ దిగవద్దని, తిరిగి లిలోంగ్వేకు వెళ్లిపోవాలని ఏటీసీ సూచించింది. ఈ క్రమంలోనే రాడార్‌తో విమానం సంబం ధాలు తెగిపోయాయి. గల్లంతైన విమానం కోసం మలావీ సైన్యం భారీ సెర్చ్ ఆపరేషన్ చేపట్టింది. ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ వందల మంది సైనికులు, పోలీసులు, అటవీ అధికారులతో ముమ్మరంగా గాలించింది. పొరుగు దేశాల హెలికాప్టర్లు, డ్రోన్లను రంగంలోకి దించింది. అంగోలా దేశ అంతరిక్ష కేంద్రం సహాయాన్ని కోరింది. అమెరికా, బ్రిటన్, నార్వే, ఇజ్రాయెల్ కూడా సహాయం అందించేందుకు ముందుకువచ్చాయని మలావీ ప్రభుత్వం వెల్లడించింది. ఈ క్రమంలోనే కూలిపోయిన విమాన శకలాలను గుర్తించినట్లు తెలిపింది.

# సిఎం రేవంత్‌తో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న భేటీ

హైదరాబాద్, పట్టభద్ర ఎమ్మెల్సీగా గెలిచిన తీన్మార్ మల్లన్న సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నల్గొండ - వరంగల్ - ఖమ్మం శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన చింతపండు నవీన్ కుమార్ (తీన్మార్ మల్లన్న) మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలి ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్సీగా గెలుపొందారు.

# ఎన్‌డిఏ మంత్రివర్గం 'పరివార్ మండల్'

న్యూఢిల్లీ, అనువంశిక రాజకీయాలపై మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం తూర్పారబట్టారు. ఎన్‌డీఏ మంత్రివర్గాన్ని 'పరివార్ మండల్' అని ఆయన అభివర్ణించారు. మోదీ 3.0 ప్రభుత్వంలో పలువురు మంత్రులు రాజకీయ కుటుంబాల నుంచి వచ్చినవారేనని రాహుల్ పేర్కొన్నారు. 'తరాల పోరాట సంప్రదాయాన్ని, సేవను, త్యాగాన్ని అత్రితపక్షపాతంగా పేర్కొనేవారు తమ 'సర్కారీ పరివార్'కు అధికార విల్లును పంచిపెడుతున్నారు' అని రాహుల్ 'ఎక్స్' పోస్ట్‌లో ఆరోపించారు. 'మాటలు, చేతలకు మధ్య ఈ తేడా పేరు నరేంద్ర మోదీ' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఎన్‌డిఏ 'పరివార్ మండల్'లో భాగంగా మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ కుమారుడు హెచ్‌డీ కుమారస్వామి, మాజీ కేంద్ర మంత్రి మాధవరావు సింధియా కుమారుడు జోతిరాదిత్య సింధియా, అరుణాచల్ ప్రదేశ్ తొలి ప్రో టెమ్ స్పీకర్ రించిన్ ఖరు కుమారుడు కిరణ్ రిజిజు, మహారాష్ట్ర మాజీ మంత్రి ఏక్‌నాథ్ ఖడ్సే కుమార్తె రక్షా ఖడ్సే, మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ మనుమడు జయంత్ చౌదరి, మాజీ కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్, మాజీ ఎంపి, మధ్య ప్రదేశ్ మంత్రి జయశ్రీ బెనర్జీ అల్లుడు జెపి నడ్డా పేర్లను రాహుల్ తన పోస్ట్‌లో ప్రస్తావించారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్ కుమారుడు రామ్ నాథ్ ఠాకూర్, మాజీ కేంద్ర మంత్రి ఎర్రన్నాయుడు కుమారుడు రామ్ మోహన్ నాయుడు, మాజీ ఎంపి జితేంద్ర ప్రసాద కుమారుడు జితిన్ ప్రసాద, హర్యానా మాజీ ముఖ్యమంత్రి రావు బీరేంద్ర సింగ్ కుమారుడు రావు ఇంద్రజిత్ సింగ్, మాజీ కేంద్ర మంత్రి వేద్ ప్రకాశ్ గోయల్ కుమారుడు పీయూష్ గోయల్, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ మనువడు రవనీత్ సింగ్ బిట్టు, అప్నా దళ్ వ్యవస్థాపకుడు సోనేలాల్ పటేల్ కుమార్తె అనుప్రియా పటేల్, ఉత్తర ప్రదేశ్ మాజీ మంత్రి మహారాజ్ ఆనంద్ సింగ్ కుమారుడు కీర్తి వర్ధమాన్

# డిస్టిలరీలకు అనుమతించి రద్దు

హైదరాబాద్, రాష్ట్రంలో కాంగ్రెస్ ఆరు నెలల పాలన తుగ్లక్‌ను తలపిస్తున్నది అని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మన్నె క్రిశాంక్ మీడియాతో మాట్లాడారు. మంత్రి జూపల్లి కృష్ణా రావు రాష్ట్రంలో సోమ్ డిస్టిలరీస్‌కు మద్యం విక్రయాలకు అనుమతి ఇచ్చి మళ్లీ రద్దు చేయడం వెనుక ఉన్న అవినీతిపై లోతైన దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. సోమ్ డిస్టిలరీలకు అనుమతుల రద్దు తాత్కాలికమా, శాశ్వతమా ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. సోమ్ డిస్టిలరీస్ అనే సంస్థ మీద విచారణ జరపాలి. సోమ్ డిస్టిలరీస్ నుండి కాంగ్రెస్ పార్టీకి ముడుపులు అందినాయి. దీని మీద పూర్తి ఆధారాలు ఇచ్చాం.. ఇప్పుడు సోమ్ డిస్టిలరీస్ సంస్థను తాత్కాలికంగా నిలిపివేశారు. సోమ్ డిస్టిలరీస్ సంస్థకు ఇచ్చిన పర్మిషన్ రద్దు చేయడమే కాదు, ఆ సంస్థకు ఎవరు పర్మిషన్ ఇచ్చారో వారిపై, ఆ కంపెనీ నుంచి ఎవరెవరికి కమిషన్లు అందాయో దానిపై విచారణ జరగాలని మన్నె క్రిశాంక్ డిమాండ్ చేశారు. నకిలీ మద్యం తయారు చేస్తుందనే పేరు సోమ్ డిస్టిలరీస్ కంపెనీకి ఉంది. గతంలో ఈ కంపెనీ యజమానులు జైలు పాలయ్యారు. మధ్యప్రదేశ్‌లో ఈ కంపెనీ లైసెన్సు జప్తు చేశారు. ఎనిమిది శాంపిల్స్ సేకరించి పరీక్షిస్తే, అందులో ఏడు శాంపిళ్లు కల్తీ మద్యం అని తేలింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం నుంచి రూ. 575 కోట్ల రూపాయలు తీసుకుని ఇప్పటి వరకు కట్టలేదు. కోర్టులో కేసు నడుస్తోంది. పర్మిషన్ లేకుండా మద్యం తయారు చేస్తే దాన్ని సీజ్ చేశారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం అనుమతి లేకుండా వందల ఎకరాల్లో ఫ్యాక్టరీ నిర్మించారు. గూగుల్ మ్యాప్ ద్వారా ఆ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి సీజ్ చేసింది. ఇవన్నీ బయటపెట్టిన తర్వాత కాంగ్రెస్ ప్రెస్ నోట్ జారీ చేసి 24 గంటల్లోనే వెనక్కి తగ్గుతున్నట్లు ప్రకటించింది. ఒకరు ఇసుక, ఒకరు బియ్యం, ఒకరు లిక్కర్ ఇట్లా పోటీ పడి మరీ పందికొక్కుల లెక్క రాష్ట్రం మీద ఎగబడి దోచుకుంటున్నరు కాంగ్రెస్ నాయకులు. రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. ఆరు హామీలు ఎంత వరకు చేశారంటే మేడిగడ్డ, ఫోన్ ట్యాపింగ్ అంటూ డైవర్షన్ చేస్తున్నారు. ఆర్టీసీ లోగో మీద వాళ్లే లీకులు ఇస్తున్నారు, అది పోస్ట్ చేసిన వాళ్ల మీద కేసులు పెడుతున్నారు అని మన్నె క్రిశాంక్ మండిపడ్డారు.

# హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన

హైదరాబాద్, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో జోరువాన పడింది.. చందానగర్, మియాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో వాన పడుతోంది. కుకట్‌పల్లి, కేపీహెచ్‌పీ, మియాపూర్, ఎల్‌బీ నగర్,ఉప్పల్, కాప్రా, మేడ్చల్‌లో కూడా కుండపోత వాన కురుస్తోంది. భారీ వర్షంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇక పలు చోట్ల హైదరాబాద్ రోడ్లు చెరువులను తలపించాయి. వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం పడడంతో సికింద్రాబాద్, అల్వాల్, కంటోన్మెంట్, బేగంపేట్, పంజాగుట్ట, అమీర్ పేట్, కూకట్ పల్లి, మాదాపూర్, ఖైరతాబాద్, నాంపల్లి, బషీర్ బాగ్, అబిడ్స్ , నారాయణగూడ, కాంచన్ బాగ్, అలియబాద్, సంతోష్ నగర్, బండ్లగూడ, చాంద్రాయణగుట్ట, ఛత్రినాక, శాలిబండ, ఫలక్ నుమా, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, కొంపల్లితోపాటు పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షానికి రోడ్లపై వరద నీళ్లు ప్రవహిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మల్లికార్జున్ నగర్ మల్లికార్జున నగర్, అశోక్ నగర్ ప్రాంతాలలో వర్షానికి కాలనీ రోడ్లు జలమయ మయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంకా భారీ వర్షం కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అని కాలనీ వాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్ ప్రాంతంలో వర్షం కురిసి తగ్గడంతో ఒకేసారి రోడ్లపైకి వచ్చిన వాహనాలతో వరంగల్ టూ మేడిపల్లి, ఉప్పల్ రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.

## భూమన రాజీనామా ఆమోదం

తిరుపతి, టిటిడి ఛైర్మన్ పదవికి వైసీసీ సీనియర్ నేత భూమన కరుణాకర్ రెడ్డి చేసిన రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుండడంతో టీటీడీ చైర్మన్ పదవికి ఆయన రాజీనామా చేశారు. కరుణాకర్‌రెడ్డి రాజీనామాను దేవాదాయ శాఖ కార్యదర్శి కరికాల వల్లవన్ ఆమోదించారు. ఈ మేకు ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. కాగా గతేడాది ఆగస్టు నెలలో టీటీడీ చైర్మన్‌గా భూమన కరుణాకర్ రెడ్డి నియమితులయ్యారు. అంతకుముందు 2006-2008 మధ్య కూడా టీటీడీ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అఖండ విజయం సాధించడంతో భూమన తన పదవికి రాజీనామా చేశారు.

# చంద్రశేఖర్ ఆజాద్ విజయం ఉత్తరప్రదేశ్‌లో బీఎస్పీపై ఎలాంటి ప్రభావం చూపనుంది?

యూపీ:లోక్‌సభ ఎన్నికల్లో, దళిత నాయకుడు చంద్రశేఖర్ ఆజాద్ ఉత్తరప్రదేశ్‌లోని నగీనా (రిజర్వ్‌డ్) స్థానం నుంచి బీజేపీకి చెందిన ఓం కుమార్‌పై 1.5 లక్షల ఓట్లకు పైగా తేడాతో విజయం సాధించారు. ఇక్కడ బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అభ్యర్థి సురేంద్ర పాల్ సింగ్ 13 వేల ఓట్లతో నాలుగో స్థానంలో నిలిచారు. 2019లో బీఎస్పీ అభ్యర్థి గిరీష్ చంద్ర ఇక్కడి నుంచి గెలిచారు. తన విజయం తర్వాత చంద్రశేఖర్ ఆజాద్ బీబీసీతో మాట్లాడుతూ, "నా చివరి శ్వాస వరకు నగీనా ప్రజలకు సేవ చేస్తాను. నాకు ఓటు వేసిన వారికి నా చివరి శ్వాస వరకు సేవ చేసి, వారి రుణం తీర్చుకుంటాను" అన్నారు. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌కు చెందిన 36 ఏళ్ల చంద్రశేఖర్ ఆజాద్ సాధించిన ఈ విజయం పర్యవసానాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా ఈ ఎన్నికల్లో ఖాతా కూడా తెరవని బహుజన సమాజ్ పార్టీపై ఈ ప్రభావం ఎలా ఉండనుందన్న చర్చ ఒకటి ఉంది. "జాతీయ రాజకీయాల్లో మాయావతి ప్రాబల్యం క్రమంగా తగ్గిపోయి, చంద్రశేఖర్ ఆజాద్ విజయం సాధించడంతో, భారతదేశం అంతటా ఆయన పార్టీని బలోపేతం చేసే అవకాశాన్ని ఇచ్చాయి. చంద్రశేఖర్‌కు ఇది చాలా మంచి అవకాశం. వయసు, ఆరోగ్యం రీత్యా పరిస్థితులు ఆయనకు అనుకూలంగా ఉన్నాయి" అని అన్నారు సీనియర్ జర్నలిస్ట్ శీతల్ పి సింగ్. ఉత్తర భారత దళిత రాజకీయాల్లో చంద్రశేఖర్‌ది యువ ముఖం. ఆయన వీధుల్లోకి రావడానికి వెనుకాడరు. పలు పోరాటాలలో జైలుకూ వెళ్లారు. ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్ జిల్లా బెహత్ తహసీల్‌కు చెందిన చంద్రశేఖర్ 2012లో హేమవతి నందన్ బహుగుణ గాడ్వాల్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయ విద్యలో పట్టా పొందారు. చంద్రశేఖర్ 2015లో భీమ్ ఆర్మీ అనే సంస్థను స్థాపించి వార్తల్లో నిలిచారు. కులపరమైన దాడులు, అల్లర్లకు వ్యతిరేకంగా గళం విప్పడం, దళిత పిల్లల్లో విద్యను ప్రోత్సహించడం తమ లక్ష్యమని భీమ్ ఆర్మీ పేర్కొంది. 2015 నుంచి, భీమ్ ఆర్మీ దేశంలోని వివిధ ప్రాంతాలలో దళితుల అణచివేతకు వ్యతిరేకంగా స్వరం వినిపించడంలో చురుకుగా ఉంది. 15 మార్చి 2020న, చంద్రశేఖర్ ఆజాద్ జాతీయ అధ్యక్షుడిగా, ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరామ్)ని స్థాపించారు. ఈ పార్టీ బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్, గౌతమ బుద్ధుడు, సంత్ రవిదాస్, సంత్ కబీర్, గురునానక్ దేవ్, అశోక చక్రవర్తి మొదలైన వారిని ఆదర్శంగా భావిస్తుంది. పార్టీ వెబ్‌సైట్ ప్రకారం, పార్టీ లక్ష్యం: "దేశంలోని వనరులు, పరిశ్రమలు, వ్యాపారాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలలో వెనుకబడిన తరగతుల భాగస్వామ్యం ఉండేలా చూడడం"కాంగ్రెస్, బీఎస్పీ, బీజేపీలను టార్గెట్ చేస్తూ ఆ పార్టీ వెబ్‌సైట్‌లో ఇలా రాశారు: "'చేయి' నిరంతరం మలినాలను సృష్టిస్తూ, 'కమలం' వికసించే అవకాశం కల్పిస్తున్న తరుణంలో, మన సమాజంలో చాలా మంది నాయకులు బంధుప్రీతితో, వృద్ధాప్యంలోని 'మాయ'ను కాపాడేందుకు రాజీపడి, మనువాదుల కీలుబొమ్మలుగా మారారు"చంద్రశేఖర్ పార్టీ ఆజాద్ సమాజ్ పార్టీ (ఏఎస్‌పీ) ఛత్తీస్‌గఢ్, బిహార్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లలో తన అభ్యర్థులను నిలబెట్టింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ కుమార్ చిత్తోడ్ బీబీసీతో మాట్లాడుతూ.. "యూపీలోనూ పార్టీ నాలుగు చోట్ల అభ్యర్థులను నిలబెట్టింది. కానీ, మేం నగీనా స్థానంలో మాత్రమే గెలిచాం. మేం సంస్థను బలోపేతం చేసి రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తాం" అని చెప్పారు. "ఎవరు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా, మేం ప్రజల హక్కుల కోసం పోరాడతాం. గతంలో అనేకమందిని మీసాలు తిప్పినందుకు, గుర్రం ఎక్కినందుకు కొట్టారు, అవమానించారు, కొందరిని కొట్టి చంపారు. ఇలాంటి అన్యాయాలు జరిగితే ప్రభుత్వం చంద్రశేఖర్ ఆజాద్‌ను ఎదుర్కోవాలి" అని చంద్రశేఖర్ హెచ్చరించారు. "ప్రభుత్వం ఏమైనా చేసి, మనుషుల హత్యలను అరికట్టాల్సిందే. కులమతాల ప్రాతిపదికన అన్యాయాలను జరగనివ్వబోం. అలా జరిగితే చంద్రశేఖర్ ఆజాద్‌తో తలపడాల్సి వస్తుంది" అని అన్నారు. యూపీలో చంద్రశేఖర్ యువ దళిత నాయకుడిగా ఆవిర్భవిస్తున్నట్లు కనిపిస్తోంది. కానీ దళిత మేధావి, కాలమిస్ట్, 'కాన్షీరామ్ కే దో చెహ్‌రే' సహా అనేక పుస్తకాల రచయిత కన్వల్ భారతిది భిన్నమైన అభిప్రాయం. "చంద్రశేఖర్ దళిత రాజకీయాలకు కొత్త ముఖం అవుతారు. కానీ, దళితుల విముక్తి కోసం ఆయన దగ్గర ఎలాంటి దృక్పథం లేదు. అందువల్ల మనం ఆయన నుంచి పెద్దగా ఆశించలేం. తక్షణ పరిస్థితులకు అనుగుణంగా ఆయన స్పందిస్తారు. కానీ ప్రైవేటీకరణ, సరళీకరణ, దళితులను హిందుత్వ గుప్పెట్లోంచి బయటకు తీసుకురావడానికి ఆయన దగ్గర ఎటువంటి భావజాలం లేదు" అని ఆయన అన్నారు.

చంద్రశేఖర్ గెలుపు బీఎస్పీకి ఎదురుదెబ్బేనా?

ఫార్వర్డ్ ప్రెస్ హిందీ ఎడిటర్, 'ఆటోబయోగ్రఫీ ఆఫ్ కాస్ట్' పుస్తక రచయిత నావల్ కిషోర్ కుమార్ కూడా చంద్రశేఖర్ సంస్థాగత సామర్థ్యాన్ని ప్రశ్నించారు. "నగీనాలో మైనారిటీలు, దళితుల జనాభా ఎక్కువగా ఉంది. బీఎస్పీ ఓట్లను విభజించడానికి లేదా తన ఉనికిని చాటుకోవడానికి తప్ప ఎన్నికల్లో గెలవడానికి పోటీ చేయలేదు. ఈ పరిస్థితుల్లోనే చంద్రశేఖర్ గెలిచారు. ఆయన దూకుడుగా వ్యవహరిస్తారు. అయితే, ఇప్పుడు ఆయన బాధ్యతాయుతంగా ఉండాలి. ఆయన తన మీసాలతో కంటే, విచక్షణతో ఎక్కువ పని చేయాలి'' అని అన్నారు. "బిహార్‌లోని పూర్ణియా స్థానంలో స్వతంత్ర అభ్యర్థి పప్పు యాదవ్ విజయం సాధించినట్లే, నగీనాలో చంద్రశేఖర్ గెలుపునూ చూడాలి. ఇది దళిత రాజకీయాలపై పెద్దగా ప్రభావం చూపదు" అని నావల్ కిషోర్ చెప్పారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎదిగిన మాయావతి ఇప్పుడు అప్రస్తుతం అయిపోయారా? గత కొన్ని ఎన్నికల్లో ఆమె పార్టీ పనితీరు చూసి పలువురు నిపుణులు ఈ ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. 1984లో ఏర్పాటైన బీఎస్పీకి షెడ్యూల్డ్ కులాలే ప్రధాన ఓటు బ్యాంకు. బీఎస్పీ అనేక రాష్ట్రాల ఎన్నికల రాజకీయాలలో చురుకుగా ఉన్నా, పార్టీ విస్తృత పునాది మాత్రం ఉత్తర ప్రదేశ్‌లోనే ఉంది. ఎన్నికల



ఫలితాల అనంతరం మాయావతి మాట్లాడుతూ, "దళిత ఓటర్లలో, నా స్వంత కులానికి చెందిన చాలా మంది బీఎస్పీకి ఓటు వేయడం ద్వారా తమ ముఖ్యమైన బాధ్యతను నెరవేర్చారు. వారికి నా కృతజ్ఞతలు. అలాగే, ముస్లిం వర్గాలకు సరైన ప్రాతినిధ్యం ఇచ్చాం. కానీ, వాళ్లు బీఎస్పీని సరిగ్గా అర్థం చేసుకోలేక పోతున్నారు. అందువల్ల భవిష్యత్తులో పార్టీ పెద్దగా నష్టపోకుండా చూసుకున్న తర్వాతే వారికి అవకాశం ఇస్తుంది" అన్నారు.

మాయావతి తన ప్రకటనలో చంద్రశేఖర్ ఎదుగుదల గురించి వ్యాఖ్యానించలేదు. అదే సమయంలో, ఆమె తన కులానికి చెందిన ప్రధాన ఓటర్లకు ధన్యవాదాలు తెలుపుతూ, ముస్లింల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

బలహీనపడుతున్న బీఎస్పీ

" మాయావతి ప్రధాన ఓటర్లు మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, అత్యంత వెనుకబడిన తరగతులు, దళితులు. కానీ బీఎస్పీ తన పునాదిని, ప్రజల నమ్మకాన్ని రెండూ కోల్పోయింది. మాయావతి ఇప్పుడు బీజేపీ తరఫున ఆడుతున్నారు. ఆమె దళితుల అణచివేత, మతోన్మాదం, రిజర్వేషన్ సమస్యలపై మౌనంగా ఉంటూ, ఇండియా కూటమి అభ్యర్థులను ఓడించడానికే తన అభ్యర్థులను నిలబెడుతున్నారు" అని దళిత మేధావి కన్వల్ భారతి అన్నారు. గణాంకాలను పరిశీలిస్తే బీఎస్పీ ఓటు బ్యాంకు క్రమంగా చెదిరిపోతోంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీఎస్పీకి 19.43 శాతం ఓట్లు రాగా, ఆ పార్టీ 10 సీట్లు గెలుచుకుంది. 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓట్ల శాతం 12.88 శాతానికి పడిపోయి ఒక్క సీటు మాత్రమే గెలుచుకోగలిగింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఓట్ల శాతం 9.39 శాతానికి పడిపోయి, ఖాతా కూడా తెరవలేకపోయింది. మధ్యప్రదేశ్‌లో ఆ పార్టీ పనితీరును పరిశీలిస్తే, ఇక్కడ ఆ పార్టీకి 2018లో 5.01 శాతం ఓట్లు వచ్చాయి. అది 2023 నాటికి 3.40 శాతానికి తగ్గింది. 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓట్ల శాతం మెరుగుపడినా, అది చాలా స్వల్పం. 2017 ఎన్నికలలో 1.5 శాతం ఓట్లు వస్తే, 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్పంగా పెరిగి అది 1.77 శాతానికి చేరింది. నావల్ కిషోర్ మాట్లాడుతూ, "బీఎస్పీ పని ఇంకా అయిపోలేదు. ఇప్పటికీ దాని 9 శాతం ప్రధాన ఓటర్లు దాని వైపు ఉన్నారు. కానీ బీఎస్పీ జాతవ్ కాని వారికీ పార్టీలో గౌరవం ఇవ్వాలి. 2007లో యూపీలో మాయావతి అధికారంలోకి వచ్చినప్పుడు వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, జాతవ్, నాన్-జాతవ్ ఇలా అందరూ ఆమె వెంటే ఉన్నారు" అని చెప్పారు. "కానీ, పార్టీ విధానపరమైన అంశాలు, పార్టీ నిర్మాణంలో ఆమె సన్నిహితుడు సతీష్ మిశ్రా ప్రభావం పెరగడంతో, పార్టీలోని జాతవ్, జాతవేతర నాయకులు ఒక్కొక్కరుగా దూరమయ్యారు. వీరిలో బాబు సింగ్ కుష్వాహా, ఓం ప్రకాష్ రాజ్‌భర్, దద్దు ప్రసాద్ ఉన్నారు. అందుకే 2012 తర్వాత, ఆమె అధికారంలోకి రాలేకపోయారు."

దళిత ఓటర్ల మద్దతు

యూపీలో షెడ్యూల్డ్ కులాల జనాభా దాదాపు 25 శాతం. వాళ్లు ప్రధానంగా జాతవ్, జాతవేతరులు. యుపీలోని జాతవ్‌లు మొత్తం షెడ్యూల్డ్ కులాల్లో దాదాపు 54 శాతం ఉండగా, జాతవేతరుల్లో పాసి, ధోబి, ఖటిక్, ధానుక్ మొదలైనవాళ్లు 46 శాతం ఉన్నారు. యూపీ అసెంబ్లీలో 86 రిజర్వ్‌డ్ స్థానాలు ఉన్నాయి. ప్రభుత్వ ఏర్పాటులో ఈ సంఖ్య చాలా ముఖ్య పాత్రను పోషిస్తుంది. ఈ దళిత ఓటు బ్యాంకు సాయంతోనే మాయావతి నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. భీమ్ ఆర్మీని ఏర్పాటు చేసిన తర్వాత, చంద్రశేఖర్ బీఎస్పీని తన పార్టీగా పిలిచేవారు. అయితే 2020లో ఆయన సొంత పార్టీని స్థాపించారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో గోరఖ్‌పూర్ నుంచి యోగి ఆదిత్యనాథ్‌పై చంద్రశేఖర్ పోటీ కూడా చేసి ఓడిపోయారు. చంద్రశేఖర్ అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుతాలు చేయలేకపోయారు. కానీ, వీధుల్లో తన పోరాటాన్ని కొనసాగించారు. కాగా, మాయావతి కూడా తన మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌ను తన వారసుడిగా చేశారు. నగీనాలో ఎన్నికల ర్యాలీలో ఆకాష్ ఆనంద్, చంద్రశేఖర్ ఆజాద్‌ను టార్గెట్ చేశారు. అయితే ఎన్నికల ర్యాలీలో ఆకాశ్ ఆనంద్ బీజేపీ ప్రభుత్వంపై దాడి చేయడం మాయావతికి కోపం తెప్పించిందని భావిస్తున్నారు. ఆ తర్వాత జాతీయ సమన్వయకర్త పదవి నుంచి ఆకాష్ ఆనంద్‌ను తొలగించారు. బీఎస్పీ మద్దతుదారు సంతోష్ కుమార్ బీబీసీతో మాట్లాడుతూ, "ఇలా చేయడం ద్వారా, బెహెన్‌జీ బీజేపీ సూచనల మేరకు నడుచుకుంటున్నట్లు సంకేతాలు ఇచ్చారు. ఇలాంటి పరిస్థితిలో, ఆమె ఓటు శాతం ఖచ్చితంగా తగ్గుతుంది. యువతకు చోటు కల్పించడం ద్వారా మాత్రమే. పార్టీ ముందుకు వెళుతుంది, దాని మద్దతుదారులు మళ్లీ పార్టీలో చేరతారు" అని అన్నారు. "ఆకాష్ ఆనంద్‌ను తొలగించడం భ్రూణహత్యతో సమానం. ఇప్పుడు చంద్రశేఖర్ పార్లమెంటుకు వెళుతున్నారు. ఉత్తర భారతదేశంలోని దళిత యువకులు ఇప్పటికే ఆయనతో సంఘటితమయ్యారు. ఇప్పుడు అవకాశం లభించడంతో, ఆయన తన పార్టీని విస్తరించాలని వాళ్లు భావిస్తున్నారు" అని జర్నలిస్ట్ శీతల్ సింగ్ అన్నారు.

# 'మోదీ కా పరివార్'ను తొలగించాలి

న్యూఢిల్లీ,సోషల్ మీడియా హ్యాండిల్స్ నుంచి 'మోదీ కా పరివార్'ను తొలగించాలని దేశ ప్రజలందరికీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారంనాడు విజ్ఞప్తి చేశారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే విజయం సాధించడం ద్వారా సమర్ధవంతంగా సందేశం వెళ్లిందని అన్నారు. ప్రధానమంత్రికి సొంత కుటుంబం లేదంటూ ఆర్జేడీ సుప్రీం లాలూ ప్రసాద్ యాదవ్ గత మార్చిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో సామాజిక మాధ్యమాల్లో మోదీకి సంఘీభావం వెల్లువెత్తింది. బీజేపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తమ పేర్లకు ముందు 'మోదీ కుటుంబం' అని రాసుకున్నారు. ఎన్నికలు పూర్తికావడం, మూడోసారి బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే సర్కార్ పదవీ బాధ్యతలు చెప్పడటంతో సోషల్ మీడియా వేదికల నుంచి 'మోదీ కా పరివార్'ను తొలగించాలని మోదీ విజ్ఞప్తి చేశారు. 'నామీద అభిమానంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో దేశవ్యాప్తంగా ప్రజలు తమ సోషల్ మీడియా ఖాతాలలో 'మోదీ కా పరివార్' అని రాశారు. ఇది నాకెంతో బలాన్ని ఇచ్చింది. ప్రజలు మూడోసారి ఎన్డీయేకు మెజారిటీ ఇచ్చారు. ఇదొక రికార్డు. దేశ అభివృద్ధిని కొనసాగించాలనే బలమైన సందేశం మాకు అందింది' అని మోదీ తన 'ఎక్స్' ఖాతాలో తెలిపారు. మనదంతా ఒకే కుటుంబం అంటూ ప్రజలిచ్చిన సందేశం అందరికీ చేరిందని, అదే కృతజ్ఞతతో మీ సోషల్ మీడియా ఖాతాల నుంచి దానిని ఇప్పుడు తొలగించాలని కోరుతున్నానని చెప్పారు. డిస్‌ప్లేలో పేరు మారినా భారతదేశ ప్రగతి కోసం ప్రయత్నిస్తున్న కుటుంబంగా మన బంధం విడదీయరానిదని మోదీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.


# మళ్లీ గేమ్ ప్లాన్?

న్యూఢిల్లీ : తాను మైనార్టీలో ఉండి.. తాను నాయకత్వం వహిస్తున్న ఎన్డీయే కూటమి బొటాబొటీ మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో రాజకీయ సుస్థిరతకు బీజేపీ భారీ స్కెచ్‌లే వేస్తుందని అంతా ఊహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ మళ్లీ ఆపరేషన్ కమల్‌ను ప్రారంభించే అవకాశాలు లేకపోలేదని జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా టీడీపీ, జేడీయూ%ఖ్రా%,ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఏదిఏమైనా చంద్రబాబు, జేడీయూ గత అనుభవాల నేపథ్యంలో ఎన్డీయే ప్రభుత్వ మనుగడ ప్రమాదంలో ఉన్నదనేది మాత్రం సత్యం. అయితే.. దీని నుంచి బయటపడేందుకు అతి త్వరలోనే బీజేపీ గేమ్‌ప్లాన్ సిద్ధం చేసే అవకాశాలు ఉన్నాయన్న చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇండియా కూటమి నుంచి గెలిచినవారిలో క్రిమినల్ కేసులు ఉన్న ఎంపీలను బీజేపీ టార్గెట్ చేసే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో ఇండియా కూటమి, ఎన్డీయే కూటమి హోరాహోరీగా తలపడ్డాయి. ఈ ఎన్నికల్లో యూపీలో బీజేపీ తీవ్ర ఎదురుదెబ్బలు తిన్నది. 80 సీట్లు ఉన్న యూపీలో ఎన్డీయే 36 సీట్లలో (బీజేపీ 33), ఇండియా కూటమిలోని ఎస్పీ, కాంగ్రెస్ 43 సీట్లు గెలుచుకున్నాయి. సీట్లు తగ్గిపోవడంతో అది అంతిమంగా బీజేపీ మెజార్టీని తగ్గించి.. సొంతగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని స్థితికి నెట్టాయి. ఎన్డీయే మనుగడకు ఢోకా లేకుండా చేసుకునేందుకు బీజేపీ తన సహజసిద్ధమైన సామ దాన బేధ దండోపాయాలు ఉపయోగించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఆ క్రమంలో క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నవారు బీజేపీ టార్గెట్ అయ్యే అవకాశం ఉన్నదని అంచనా వేస్తున్నారు. యూపీలో ఇండియా కూటమి తరపున ఎంపీలుగా గెలిచిన సుమారు ఆరుగురిపై రెండేళ్ల కనీస జైలు శిక్ష పడే పలు క్రిమినల్ అభియోగాలు ఉన్నాయి. అయితే లొంగిపోవడం లేదా జైలుకు పోవడం.. గత పదేళ్లలో అభియోగాలు ఎదుర్కొన్నవారి విషయంలో జరిగింది ఇదే. చాలా మంది అభియోగాలు ఉన్న ఎంపీలు బీజేపీకి దాసోహం అనడంతో వారిపై మచ్చలన్నీ మటుమాయమయ్యాయి. వ్యతిరేకించి కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ వంటి వారు జైలుపాలయ్యారు. ఇప్పుడు అదే రీతిలో.. ఇండియా కూటమి తరపున ఎంపీలుగా గెలిచిన ఆరుగురితో బీజేపీ గేమ్ ప్లాన్ రూపొందిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వారికి రెండేళ్ల జైలు శిక్ష పడితే.. వారు పార్లమెంటు సభ్యుడిగా అర్హత కోల్పోతారు. వారిలో ఘాజీపూర్ ఎంపీ అఫ్జల్ అన్సారీ ఒకరు. ఆయన కొద్ది నెలల క్రితం హత్యకు గురైన గ్యాంగ్‌స్టర్‌గా ఉండి రాజకీయ నాయకుడిగా మారిన ముక్తార్ అన్సారీ పెద్ద సోదరుడు. గ్యాంగ్‌స్టర్ యాక్ట్ కేసులో ఇప్పటికే నాలుగేళ్ల జైలు శిక్ష విధించారు. అయితే.. అలహాబాద్ హైకోర్టు శిక్షపై స్టే ఇచ్చి, ఆయన ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఈ కేసులో విచారణ తిరిగి జూలైలో ప్రారంభం కానున్నది. అన్సారీకి విధించిన శిక్షను కోర్టు సమర్థిస్తే.. ఆయన ఎంపీ సభ్యత్వాన్ని కోల్పోతారు. ఆజంగఢ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్‌పై నాలుగు క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో ఆయనకు రెండేళ్లకు మించి శిక్ష పడితే.. ఆయన కూడా పార్లమెంటు సభ్యుడిగా అనర్హతకు గురవుతారు. జౌన్‌పూర్ ఎంపీ బాబు సింగ్ కుష్వాహాపై ఎన్ఆర్‌హెచ్ఎం కుంభకోణానికి సంబంధించి 25 కేసులు ఉన్నాయి. ఈ కుంభకోణం మాయావతి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలం నాటిది. బీజేపీ అభ్యర్థి మేనకాగాంధీని సుల్తాన్‌పూర్ సీటులో ఓడించిన రాంభువల్ నిషాద్ 8 కేసులలో నిందితుడిగా ఉన్నారు. అందులో ఒకటి గ్యాంగ్‌స్టర్ యాక్ట్ కింద నమోదైంది. చందౌలి నుంచి గెలిచిన వీరేంద్రసింగ్, సహరాన్‌పూర్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ పైనా అనేక క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఈ ఆరుగురు ఇండియా కూటమి ఎంపీలపై మనీలాండరింగ్, గ్యాంగ్‌స్టర్ యాక్ట్ సహా అనేక కేసులు ఉన్నాయి. వీటిలో ఏ కేసులోనైనా రెండేళ్లకు మించి జైలు శిక్ష పడే అవకాశాలు ఉన్నాయి. గతంలో క్రిమినల్ కేసులలో శిక్షలు పడి పార్లమెంటు సభ్యత్వాన్ని కోల్పోయిన ఎంపీలు ఉన్నారు. మహ్మద్ ఆజం ఖాన్, ఖాబూ తివారి, విక్రం సైని, అశోక్ చందేల్ వంటివారు ఇలానే సభ్యత్వం కోల్పోయారు.

## రామోజీ మరణం తీరని లోటు

హైదరాబాద్, రామోజీ గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు కుటుంబ సభ్యులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరామర్శించారు. గుండె సంబంధిత సమస్యలతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేరిన రామోజీరావు చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఆరోజు సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీ పర్యటనలో ఉండటంతో రామోజీరావు పార్థివదేహానికి నివాళులర్పించ లేకపోయారు. రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో రామోజీరావు అంత్యక్రియలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఫిల్మ్‌సిటీలోని ఆయన నివాసానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రామోజీరావుతో తనకున్న అనుబంధాన్ని 'ఈనాడు' ఎండీ కిరణ్, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, రామోజీ ఫిల్మ్‌సిటీ ఎండీ విజయేశ్వరితో పంచుకున్నారు. రామోజీరావు వ్యక్తి కాదు వ్యవస్థ.. ఆయనకు ప్రత్యామ్నాయం లేదన్నారు. రామోజీ చూపిన మార్గంలో వారి కుటుంబ సభ్యులు, సంస్థలు ప్రజల తరఫున నిలబడాలని ఆకాంక్షించారు. ఆయన ఆలోచనా విధానాలకు అనుగుణంగా ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, మల్‌రెడ్డి రంగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు సీఎం వెంట ఉన్నారు. అలాగే దివంగత రామోజీరావుకు త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి నివాళు

# కొండెక్కిన కూరగాయల ధరలు



హైదరాబాద్, మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. వాటిని కొనాలంటేనే సామాన్యుడు హడలెత్తిపోతున్నాడు. నిన్నమొన్నటి వరకు కాస్త పరవాలేదు అనుకున్న ఉల్లి ధర కూడా ఇప్పుడు ఘాటెక్కింది. రిటైల్ మార్కెట్‌లో కేజీ ఉల్లి ధర రూ. 40 నుంచి రూ. 45 వరకు పలుకుతోంది. మహారాష్ట్ర మార్కెట్ నుంచి దిగుమతులు తగ్గడమే ధర పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు తెలిపారు. తెలంగాణలోని మలక్‌పేట్, ఏపీలోని తాడేపల్లిగూడెం ఉల్లి మార్కెట్‌కు దేశవ్యాప్తంగా ఫేమస్. ఈ మార్కెట్‌లకు షోలాపూర్, నాసిక్, పుణె, అహ్మద్‌నగర్ ప్రాంతాల నుంచి నిత్యం కనీసం 450 టన్నుల వరకు ఉల్లి దిగుమతి అవుతుంది. ఇకడి నుంచి వివిధ ప్రాంతాలతోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో పలు మార్కెట్లకు తరలుతుంది. ఈ మార్కెట్‌కు ప్రస్తుతం రోజుకు 240 టన్నుల ఉల్లి మాత్రమే వస్తుండటం వల్ల వారంరోజులుగా ఉల్లి ధరల్లో మార్పులు వచ్చాయి. వారం క్రితం రిటైల్ మార్కెట్‌లో కేజీ రూ. 20 నుంచి రూ. 30 వరకు పలికిన కేజీ ఉల్లి.. ఇప్పుడు రూ. 50 నుంచి రూ. 60కి చేరాయి. వారం క్రితం నాసి రకం ఉల్లి రూ. 100కి మూడు కిలోలు విక్రయిస్తుండగా.. ప్రస్తుతం వాటి నాణ్యత తక్కువగా ఉన్న వాటిని రూ. 40 నుంచి రూ. 45 వరకు విక్రయిస్తున్నారు. పైగా త్వరలో బక్రీద్ పండగ ఉండటంతో డిమాండ్ అంతకంతకూ పెరుగుతుంది. డిమాండ్, సరఫరా మధ్య అంతరం ఏర్పడటం వల్ల ధరలు పెరిగాయని మార్కెట్ ట్రేడర్లు చెప్పారు.

ప్రతికూరగాయ ధర 10 పెరిగింది

కూరగాయల ధరలు పెరుగుదలపై ఎర్రగడ్డ రైతు బజార్ ఈవో రమేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. వర్షాకాలంలో కొత్త పంట వేయడంతో.. ఆ తేడా ధరల్లో కనిపిస్తున్నదని తెలిపారు. ప్రతి కూరగాయలోనూ 10 రూపాయల పెరుగుదల కనిపిస్తోంది. వివిధ జిల్లాల్లో నుంచి దిగుబడి తకువగా ఉండటంతో కూరగాయల ధరలు పెరిగాయని, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు కూడా పెరిగిపోవడంతో ఆ భారం

# సంస్థాగత మార్పులపై బిజెపి దృష్టి



న్యూఢిల్లీ, కేంద్రంలో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన భాజపా .. తాజాగా పార్టీ సంస్థాగత మార్పులకు సిద్ధమైంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా త్వరలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. దీంతోపాటు పార్టీ జాతీయాధ్యక్షుడి ఎంపిక, రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలు, పార్టీ అధ్యక్షుల మార్పు వంటి అంశాలపై కాషాయ పార్టీ దృష్టి సారించినట్లు సమాచారం.భాజపా జాతీయాధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డా.. తాజాగా కేంద్ర మంత్రివర్గంలో చేరారు. పార్టీ అధ్యక్షుడిగా ఆయన పదవీకాలాన్ని ఇటీవల ఆరు నెలలు పొడిగించగా.. అది కూడా జూన్ 30తో ముగియనుంది. దీంతో పార్టీకి కొత్త అధ్యక్షుడి ఎంపిక అనివార్యమైనట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయ్యేవరకు నడ్డా పదవీ కాలాన్ని భాజపా పార్లమెంటరీ బోర్డు పొడిగించే అవకాశం ఉన్నప్పటికీ దీనిపై అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే కొత్త అధ్యక్షుడి ఎంపికకే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో భాజపా అధ్యక్షుడిగా ఉన్న అమిత్ షా.. కేంద్రం హోంశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అప్పుడు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నడ్డా.. జనవరి 2020లో పూర్తిస్థాయి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. పార్టీని పటిష్ఠ పరిచేందుకు శాయశక్తులా కృషి చేసే సీనియర్ నేతకు పార్టీ పగ్గాలు అప్పజెప్పాలనేది ప్రధాని మోదీ నిర్ణయమని.. అందుకే జేపీ నడ్డాను అప్పట్లో ప్రభుత్వంలోకి తీసుకోలేదన్న సంకేతాన్ని పంపించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ అధ్యక్షుడిగా ధర్మేంద్ర ప్రధాన్, భూపేంద్ర యాదవ్ వంటి సీనియర్ల నేతల పేర్లు వినిపించినప్పటికీ ప్రస్తుతం వాళ్లు కేంద్ర మంత్రివర్గంలో కొనసాగుతుండడంతో వారికి ఆ అవకాశం రానట్లేనని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రాల నుంచి కొత్త వ్యక్తిని ఎంపిక చేయడం లేదా జాతీయ కార్యదర్శుల్లో ఒకరికి అధ్యక్ష పగ్గాలు అప్పగించవచ్చనే వాదన వినిపిస్తోంది. వీటితోపాటు పలు రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షులను మార్చే యోచనలో భాజపా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఉత్తర్ ప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికల్లో భారీగా నష్టపోయిన పార్టీ.. అధ్యక్షుడిగా కొత్త ముఖాన్ని పరిచయం చేయనున్నట్లు సమాచారం. పశ్చిమ బెంగాల్‌లో పార్టీ అధ్యక్షుడిగా ఉన్న సుకాంత మజుందార్ కేంద్ర మంత్రి కావడం, బిహార్ పార్టీ అధ్యక్షుడు ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతుండటం, హరియాణా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ చేతుల్లోనే పార్టీ పగ్గాలు ఉండటంతో ఆయా రాష్ట్రాల అధ్యక్షుల మార్పు అనివార్యంగా కనిపిస్తోంది. సామాజిక సమీకరణాల నేపథ్యంలో రాజస్థాన్‌లో భాజపా అధ్యక్షుడిని మార్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఎక్కడో లెక్క తప్పింది...కాళేశ్వరం బ్యారేజ్‌పై విచారణ



హైదరాబాద్ : కాళేశ్వరం ఎత్తిపోతల సాగునీటి పథకంలోని బ్యారేజీల విషయం నిజాయితీగా స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు తెలపాలని న్యాయమూర్తి పి.సి.ఘోస్ సంబంధిత ఇంజనీర్ల ను కొనసాగించారు. తన విచారణలో వెల్లడించిన విషయాలు , అభిప్రాయాలను ఈ నెల 25లోపు అఫిడవిట్ల రూపంలో సమర్పించాలన్నారు. గోదావరి నదిపై ని ర్మించిన మేడిగడ్డ బ్యారేజి కుంగిపోవ టం, ఎగువన ఉన్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు బుంగలు పడటం నీటి లీకేజీలు, బ్యారేజీల డిజైన్లు ,ఉన్నత స్థాయి కమిటీలు, నిర్మాణ ప్రాజెక్టుల సందర్భంగా పెంపుదల అంశాలకు సంబంధించి నిజాలను నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణ చేపట్టింది. మేడిగడ్డ సహా కాళేశ్వర ప్రాజెక్టు ఆనకట్టలకు సంబంధించిన పనుల ఇంజనీర్లు అందరూ ఫిడవిట్లు దాఖలు చేశారు కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ పినాకీ చంద్రఘోష్ తెలిపారు.విచారణ ప్రక్రియలో భాగంగా కమీషన్ ముందు మంగళవారం నీటిపారుదల శాఖకు చెందిన 20 మందికి పైగా ఇంజినీర్లు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల నిర్మాణం, నాణ్యత నిర్వహణ, డ్యాం సేఫ్టీ ఇంజినీర్లు ఇందులో ఉన్నారు. డిజైన్లు, అధ్యయనాలు, గమనించిన అంశాలు, తీసుకున్న చర్యలు, తదితరాల గురించి ఇంజినీర్లను విచారించారు. కమీషన్ ముందు చెప్పిన వస్తువులను అఫిడవిట్ల రూపంలో సమర్పించడానికి కమీషన్ ఇంజినీర్లను సిద్ధం చేసింది. మూడు ఆనకట్టల బాధ్యతలు చూసిన ఇంజినీర్ల విచారణ జరుగుతోన్న న్యాయమూర్తి పీసీ ఘోష్, ఇంజినీర్లు అందరినీ ఈ నెల 25వ తేదీలోపు అఫిడవిట్ దాఖలు చేసినట్లు చెప్పారు. అఫిడవిట్ ద్వారా అయితే అన్ని అంశాలు రికార్డు అవ అన్నారు. బ్యారేజీల విషయంలో లెక్కలు ఎక్కడో తప్పినట్లు కనిపిస్తోందన్న న్యాయ సమస్యలు రాకపోయి ఉంటే ప్రజలకు చాలా ఉపయోగపడేవని పేర్కొన్నారు.లోపం ఎక్కడుంది, ఏం జరిగిందన్న విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాం అన్నారు. ఎవరి ప్రమేయం అయినా ఉందా అని కూడా తెలుసుకునే ప్రయత్నం న్యాయమూర్తి ఘోష్ చేసారు. నిర్మాణ సంస్థల ప్రతినిధులను కూడా విచారణకు పిలుస్తామని అన్నారు. ఈ విచారణలో భాగంగా డ్యాం సేఫ్టీ చట్టానికి లోబడి తీసుకున్న చర్యలు, సూచనలను కూడా ఇంజినీర్ల ద్వారా తీసుకుంది. ఇదే సమయంలో ఆయా సందర్భంగా నిర్మాణ సంస్థ, నీటిపారుదలశాఖ మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, పైఅధికారులతో సంప్రదింపులు, వారి అమలుకు సంబంధించిన అంశాలకు సంబంధించిన కమీషన్ ఇంజినీర్లను ప్రశ్నించారు. సమస్యలు తలెత్తకుండా, మరమ్మత్తులు ఎందుకు చేయలేదని అందుకు గల కారణాలపై కూడా జస్టిస్ పీసీ ఘోష్ కమీషన్ విచారణలో ఇంజినీర్ ఆరా తీసింది. తొలిరోజు ముగ్గురు రిటైర్డ్ ఈఎన్సీలు మురళీధర్(జనరల్) వేంకటేశ్వర్లు(కాళేశ్వరం ప్రాజెక్టు), నరేందర్ (డిజైన్స్)తోపాటు ఎస్ఈలు చంద్రశేఖర్,బసవరాజు తదితరులను కమీషన్ విచారణ చేసింది. బుధవారం కూడా విచారణ ప్రక్రియ కొనసాగనుంది.

# మిత్రులకు మొండిచేయి ..

## కీలక పదవ్రులన్నీ బిజెపికే...

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ మంత్రిమండలిలో బిజెపి భాగస్వామ్య పక్షాలకు సముచిత ఉనికి లభించలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అనేక మిత్రపక్షాల డిమాండ్లను మోడీ ఖాతరు చేయలేదు. మోడీ క్యాబినెట్‌లోని 72 మంది సభ్యుల్లో బిజెపి భాగస్వామ్య పక్షాలకు చెందిన 11 మందికే చోటుదక్కింది. వారిలోనూ ఐదుగురికే క్యాబినెట్ హోదా లభించింది.

క్యాబినెట్ పదవులు వీరికే

దక్షిణాది నుండి జెడిఎస్ నేత హెచ్‌డి కుమారస్వామికి భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ లభించింది. తెలుగుదేశం పార్టీకి చెందిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు పౌర విమానయాన శాఖను కేటాయించారు. బీహార్ నుండి హిందుస్థానీ ఆవామ్ మోర్చ సెక్యులర్ పార్టీకి చెందిన జితన్ రామ్ మాంఝీకి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖను అప్పగించారు. అదే రాష్ట్రానికి చెందిన జెడియు ఎంపీ రాజీవ్ రంజన్‌సింగ్‌కు పంచాయతీరాజ్‌తోపాటు మత్స్య. పశు సంవర్ధక, డెయిరీ శాఖను ఇచ్చారు. లోక్ జనశక్తి (రాం విలాస్) నేత చిరాగ్ పాశ్వాన్‌కు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖను కేటాయించారు. మిత్రపక్షాలకు చెందిన ఈ ఐదుగురికి మాత్రమే క్యాబినెట్ హోదా దక్కింది.

సహాయ మంత్రులు వీరే

శివసేనకు చెందిన జాదవ్ ప్రతాప్‌రావు గణపతిరావ్, ఆర్‌ఎల్‌డీకి చెందిన జయంత్ చౌదరికి స్వతంత్ర హోదాతో మంత్రి పదవులు లభించాయి. ఇక రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అథావలే) నేత రాందాస్ అథావలేకు ఒక మంత్రిత్వ శాఖలో, అప్నాదళ్‌కు చెందిన అనుప్రియా పటేల్‌కు రెండు మంత్రిత్వ శాఖల్లో సహాయ మంత్రి పదవులు ఇచ్చారు. ఆయా పార్టీలకు సభలో వీరిద్దరు మాత్రమే నిర్వహిస్తున్నారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి, సోషలిస్టు నేత కర్పూరీ ఠాకూర్ కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్, తెలుగుదేశం పార్టీకి చెందిన పెమ్మసాని చంద్రశేఖర్‌లకు కూడా సహాయ మంత్రి పదవులు లభించాయి.డిమాండ్లు



నెరవేరలేదుపదహారు మంది సభ్యులు తెలుగుదేశం పార్టీ స్పీకర్ పదవితో పాటు నాలుగు కీలక మంత్రిత్వ శాఖల కోసం పట్టుబట్టి, చివరికి రెండు పదవులతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చిందని తెలిసింది. జనసేనకు క్యాబినెట్‌లో స్థానం దక్కలేదు. మరో 12 మంది ఎంపీలున్న జెడియు రైల్వేలు సహా మూడు మంత్రిత్వ శాఖలను కోరింది. ఒకప్పుడు తన తండ్రి రాం విలాస్ పాశ్వాన్ నిర్వహించిన రైల్వే శాఖను తనకు కేటాయించాలని చిరాగ్ కూడా అడిగారు. నరేంద్ర మోడీ మాత్రం కీలకమైన బిజెపి సభ్యులకే కట్టబెట్టారు.మిత్రపక్షాలకు పరిమాణంలోనే (క్వాంటిటీ)లోనే కాదు...నాణ్యత (క్వాలిటీ)లోనూ మొండిచేయే చూపారని ఆమ్‌ఆద్మీ పార్టీ ఎంపీ సంజరు సింగ్ వ్యంగ్యోక్తి విసిరారు. 'హోం లేదు. రక్షణ లేదు. ఆర్థికం లేదు. విదేశాంగ శాఖా లేదు. వాణిజ్యం లేదు. రైల్వే లేదు. విద్య లేదు. ఆరోగ్యమూ లేదు. వ్యవసాయం లేదు. జల శక్తి లేదు. పెట్రోలియం లేదు. టెలీకమ్యూనికేషన్లూ లేవు' అని సెటైర్ వేశారు. బిజెపి మిత్రపక్షాలకు ఇది అవమానకరమని ఆయన చెప్పారు. మంత్రి పదవిని ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్ తిరస్కరించారని, తనకు ఇవ్వజూపిన పదవి తన స్థాయిని తగ్గిస్తుందని ఆయన భావించారని కాంగ్రెస్ ప్రతినిధి జైరాం రమేష్ తెలిపారు.

# మణిపూర్ మంటలు...

మణిపూర్:మణిపూర్‌లో హింసాకాండ మరోసారి ప్రజ్వరిల్లడం ఆందోళన కలిగిస్తోంది. ఏడాది గడుస్తున్నా అక్కడ పూర్తి స్థాయిలో శాంతి ఏర్పడలేదు. ఎన్నికల కారణంగా దేశం దృష్టి అటువైపు మళ్లనప్పటికీ చెదురుమదురు ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. గత ఏడాది మే నెల నుంచి మణిపూర్‌లో చెలరేగుతున్న హింసాకాండ ప్రభావం అంతగా లేని జిరీబాం జిల్లాలో ఇటీవల ఘర్షణలు మొదలై పరిస్థితులు చేయిదాటిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. అసోం సరిహద్దుల్లో ఉండే ఈ జిల్లాలో సోమవారం జరిగిన సీఎం భద్రతా కాన్వాయ్‌పై దాడితో మరోసారి మణిపూర్ సమస్య దేశవ్యాప్తంగా చర్చలోకి వచ్చింది. తీవ్రవాదుల కాల్పుల్లో ఓ అధికారి, మరో సామాన్య పౌరుడు తీవ్రంగా గాయపడ్డారు.సీఎం బీరేన్ సింగ్ జిరీబాం సందర్శనకు ఒకరోజు ముందు ఈ దాడి జరిగింది.

తన కాన్వాయ్ మీదనే తీవ్రవాదులు దాడికి తెగబడటంపై సీఎం దిగ్భ్రాంతి వ్యక్తం చేయడం ఆయన నిస్సహాయతను సూచిస్తోంది. ఇటీవల అదృశ్యమైన మెయితీ తెగకు చెందిన ఓ రైతు మృతదేహం జూన్ 6న కనిపించినప్పటి నుంచి జిరీబాంలో ఘర్షణలు ఉధృతరూపం దాల్చాయి. ఓ పోలీసు ఔట్‌పోస్టును, అనేక ఇండ్లను సాయుధమూకలు తగలబెట్టాయి. ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకోవడంతో జిల్లావ్యాప్తంగా కర్ఫ్యూ విధించారు. జిరీబాంలో అనేక వంతెనలను సాయుధ బృందాలు ధ్వంసం చేస్తూ రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. వంతెనలను బాగుచేయడం పౌర నిర్వహణ వల్ల సాధ్యపడ సైన్యాన్ని రంగంలోకి దింపాల్సి వచ్చింది. మరోసారి హింసాకాండ, ఘర్షణలు పేట్రేగడంతో జిరీబాం నుంచి అసోంలోకి మణిపురీల వలసలు పెరిగిపోయాయి. వరదలా వచ్చిపడుతున్న జనాన్ని ఆపేందుకు అసోం ప్రభుత్వం మణిపూర్ సరిహద్దుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసింది. మిగిలిన మణిపూర్‌తో



ప్రస్తుతం నిన్నమొన్నటి వరకు ప్రశాంతంగా ఉన్న జిరీబాం ఇప్పుడు అట్టుడుకుతుండటం.డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలోని మణిపూర్ ఏడాదికాలం మండుతూనే ఉండటం వల్ల బీజేపీ పరిపాలన సామర్థ్యానికి అద్దం పడుతోంది. మైదాన ప్రాంతంలో నివసించే మెజారిటీ మెయితీ, కొండల్లో నివసించే మైనారిటీ గిరిజన కుకీల మధ్య ఎడతెగకుండా సాగుతున్న ఘర్షణలు రాష్ట్రంలో శాంతి లేకుండా చేశాయి. మణిపూర్‌లో ఘోరమైన ఊచకోతలు, అత్యాచారాలు జరుగుతున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తనకు తెలిసిన కారణాల వల్ల మౌనం వహిస్తోంది. ఫలితంగా మణిపూర్ రావణకాష్టంలా మండుతూనే ఉన్నది. పరిస్థితి మరింత విషమించి, తీవ్రవాదం శ్రుతిమించక ముందే కేంద్రం శాంతి స్థాపనకు చర్యలు చేపట్టాలి. లోక్‌సభ ఎన్నికల్లో మణిపూర్‌లో బీజేపీ తనకున్న ఒక్క సీటునూ కోల్పోయింది. రెండు స్థానాల్లో ప్రజలు కాంగ్రెస్ వైపే మొగ్గు చూపారు. మణిపూర్‌తో పాటు దేశవ్యాప్తంగా జరిగిన పరాభవం దృష్ట్యా బీజేపీ వైఖరిని మార్చుకోవడం ఆ పార్టీకి శ్రేయస్కరం.

# ఎన్ఆర్ఐ పరీక్ష ఇక చౌక.. 18 లక్షలకే స్కానింగ్ యంత్రం



బెంగళూరు,హాంకాంగ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం చౌకైన మాగ్నెటిక్ రెసొనెన్స్ ఇమేజింగ్(ఎన్ఆర్ఐ) యంత్రాన్ని తయారు చేసింది. ఇప్పుడు వినియోగంలో ఉన్న ఎన్ఆర్ఐతో దాదాపు 50 ధర తక్కువ ధరకే దీన్ని తయారుచేసే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ యంత్రం అందుబాటులోకి వస్తే ఎంఆర్ఐ స్కానింగ్ ధర కూడా భారీగా తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం అత్యంత ఖరీదైన వైద్య పరీక్షల్లో ఎంఆర్ఐ స్కానింగ్ ఒకటి. గుండె, మెదడు, ఎముకల సంబంధ సమస్యలను, క్యాన్సర్లను గుర్తించడానికి వైద్యులు ఎక్కువగా పేషెంట్లకు ఎన్ఆర్ఐ స్కానింగ్ చేయిస్తారు.దాదాపుగా రూ.7 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చు అవుతుంది. కొన్ని చోట్ల కంటే తక్కువ ధరకు చేస్తున్నప్పటికీ ఇంత వెయిటింగ్ పీడ్ ఎక్కువగా ఉంటుంది. ఎన్ఆర్ఐ పరీక్షకు ఇంత ఎక్కువ ధర ఉండటానికి ప్రధాన కారణం ఈ పరీక్ష చేసే యంత్రం ఖరీదైనది కావడమే. మన దేశంలో 3-టీ ఎన్ఆర్ఐ మెషీన్ ధర దాదాపుగా రూ.9 కోట్ల నుంచి రూ.13 కోట్ల వరకు ఉంటుంది. దీనికి అవసరమైన సౌకర్యాల కోసం మరింత ఖర్చు అవుతుంది. ఇంత భారీ ధర పెట్టి ఎంఆర్ఐ యంత్రం కొనుగోలు చేయడం వల్ల పరీక్షకు సైతం ఎక్కువగా ధర వసూలు చేస్తున్నారు.

ధర తక్కువ.. నిర్వహణ సులభం

ధర ఎక్కువగా ఉండటం వల్ల పేదలు అవసరమైనప్పుడు ఎంఆర్ఐ పరీక్ష చేయించుకోలేకపోతున్నారు. ఈ పరిస్థితిని గుర్తించిన హాంకాంగ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఈ కొత్త ఎన్ఆర్ఐ యంత్రాన్ని తయారు చేశారు. దీని ధర దాదాపు 22 వేల డాలర్లు ఉంటుంది. భారతీయ కరెన్సీలో ఇది రూ.18.4 లక్షలు. తక్కువ సామర్థ్యం గల 0.05 టెస్లా(టీ) అయస్కాంతాలతో ఈ కొత్త ఎన్ఆర్ఐ యంత్రాన్ని తయారు చేశారు. సాధారణ ఎన్ఆర్ఐ యంత్రాన్ని ప్రత్యేక రక్షణ కలిగిన గదిలో ఏర్పాటు చేయవలసి ఉంటుంది. ఇందులోని అయస్కాంతాలను చల్లబరిచేందుకు లిక్విడ్ హీలియం వాడతారు. దీనికి విద్యుత్తు సదుపాయం కూడా వేరుగా ఇవ్వాల్సి ఉంటుంది.ఈ కొత్త ఎన్ఆర్ఐ యంత్రాన్ని సాధారణ గదిలోనే ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదు, దీనికి హీలియం కూలెంట్ అవసరం లేదు, మామూలు విద్యుత్తు ఔట్‌లెట్‌తోనే వినియోగించుకునే శాస్త్రవేత్త డాక్టర్ ఎడ్వూ తెలిపారు. దీని ధర తక్కువ అని, నిర్వహణ సులభమని, విద్యుత్తు వినియోగం కూడా తక్కువ అని. అయితే, 3టీ ఎంఆర్ఐ యంత్రంతో ప్రస్తుతం 0.05టీ ఎంఆర్‌టీ యంత్రంలో ఇమేజ్ నాణ్యత తక్కువగా ఉందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. దీనికి పరిష్కారంగా ఏఐని వినియోగిస్తున్నామని, ఏఐ ద్వారా ఇమేజ్ నాణ్యతను పెంచొచ్చని ఎడ్వూ చెప్తున్నారు.

## హత్యకేసులో

## కన్నడ నటుడు దర్శన్ అరెస్ట్

బెంగళూరు,ఒక హత్యకేసులో కన్నడ సినీ హీరో దర్శన్‌ను పోలీసులు వఅరెస్ట్ చేశారు. ఉదయం మైసూరులోని ఫాం హౌస్ నుండి దర్శన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు బెంగళూరు పోలీసులు తెలిపారు. ఆయనతో పాటు మరో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నామని, రెండు రోజుల క్రితం హత్య కేసు నమోదైందని పోలీసులు పేర్కొన్నారు. దర్శన్‌ను కస్టడీలోకి తీసుకున్నట్లు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డిసిపి) నిర్ధారించారు. ఈ అరెస్టుపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 8న రేణుకాస్వామి హత్యకు గురయ్యారు. ఆ మరుసటి రోజు కామాక్షిపాళ్యం సమీపంలోని ఒక కాలువలో మృతదేహం కనిపించింది. మృతుడిది చిత్రదుర్గమని, ఫార్మసీ కంపెనీలో పనిచేస్తున్నారని అన్నారు. ఈ కేసులో దర్శన్‌పై ఆరోపణలు వచ్చాయి. హీరో దర్శన్ సూచనతోనే హత్య చేసినట్లు నిందితులు అంగీకరించారు. దీంతో దర్శన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. దర్శన్‌కు సన్నిహితు రాలైన మరో నటికి రేణుకాస్వామి అసభ్యకరమైన సందేశాలు పంపినట్లు పోలీసులు తెలిపారు.

# కేబినెట్‌లో 70 శాతం శత కోటీశ్వరులే !



న్యూఢిల్లీ : మోడీ కొత్త మంత్రివర్గంలోని 71 మంది మంత్రుల్లో 70 మంది (99 శాతం) కోటీశ్వరులే ఉన్నారు. 71 మంది మంత్రుల సగటు ఆస్తులు రూ.107.94 కోట్లు. ఆరుగురు మంత్రులకు రూ.100 కోట్లకు పైగా ఆస్తులు తమ ఎన్నికల అఫిడవిట్‌లో ప్రముఖమైనవి. ఈ పరీక్ష ఎన్నికల వాచ్ డాగ్ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడిఆర్) చూపు. కొత్త మంత్రివర్గంలో బిజెపి నుండి 61 మంది, ఎన్‌డిఎ మిత్రపక్షాల నుండి 11 మంది ఉన్నారు. 72 మంది మంత్రుల్లో 43 మంది లేదా అంతకంటే ఎక్కువ సార్లు ఎంపీలుగా ఎన్నికయ్యారు. 39 మంది గతంలో కేంద్ర మంత్రులుగా పనిచేశారు.

అత్యంత సంపన్నుడు పెమ్మసాని

మోడీ మంత్రివర్గంలో అత్యంత ధనిక మంత్రిగా, టిడిపి నుంచి లోక్‌సభకు ఎన్నికైన పెమ్మసాని చంద్రశేఖర్ నిలిచారు. ఆయనను గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖకు సహాయ మంత్రిగా నియమించారు. ఆ తరువాత స్థానంలో జ్యోతిరాదిత్య సింధియా ఉన్నారు.

ఆయన కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రిగా ఉన్నారు. మూడో స్థానంలో ఉన్న హెచ్‌డి కుమారస్వామి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రిగా నియమితులయ్యారు. అశ్వని వైష్ణవ్ రైల్వే, ఐ అండ్ బి, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రిగా ఉన్నారు. ఐదో స్థానంలో ఉన్న పియుష్ గోయల్ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి ముందు దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా ఈ మంత్రుల ఆస్తులను ఎడిఆర్ లెక్కించారు. 71 మంది కేంద్ర మంత్రుల్లో 47 (66 శాతం) మంది కొత్తవారు కాగా, వారి వయస్సు 51-71 మధ్య ఉంది. 11 మంది ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించగా, 57 మంది గ్రాడ్యుయేట్, ఆపైన చదివారు.

28 మందిపై క్రిమినల్ కేసులు

మంత్రివర్గంలో 28 (39 శాతం) మంది మంత్రులు తమపై క్రిమినల్ కేసులను కేంద్రీకరించారు. వారు హత్యాయత్నాలు, కిడ్నాప్, మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నాయని తమ అఫిడవిట్‌లలో పేర్కొన్నారు. వీరిలో 19 మంది మంత్రులపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయని ఎడిఆర్ గుర్తించారు. తమపై హత్యాయత్నం కేసులు ఉన్నట్లు ప్రకటించిన మంత్రుల్లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన శంతను ఠాకూర్, సుకాంత మజుందార్.

# మద్యం ప్రియులకు శుభవార్త...బ్రాండెడ్ మద్యం దిగుమతి

అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లోని మద్యం ప్రియులకు శుభవార్తే. గత ఐదేళ్లుగా బ్రాండెడ్ మద్యం కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసిన వారి ఆశలు ఫలించాయి. ప్రభుత్వం మారడంతో బ్రాండెడ్ మద్యం మళ్లీ దిగుమతి అవుతోంది. కొత్త స్టాక్‌తో మద్యం దుకాణాలు కళకళలాడుతున్నాయి.

తాజాగా కింగ్‌ఫిషర్ బీర్లు గొడౌన్లకు చేరుకున్నాయి. గోదాములలోకి లారీల నుంచి బీర్లను అన్‌లోడ్ చేస్తున్న వీడియోను టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఏపీ నుంచి మాయమైపోయిన బీర్లు మళ్లీ వచ్చాయని ఆయన దానికి క్యాప్షన్ జోడించారు. ఈ వీడియోపై నెటిజన్లు సంతోషం వ్యక్తంచేస్తూ కామెంట్లు పెడుతున్నారు. కింగ్‌ఫిషర్ ఒక్కటే కాదని, పలానా బ్రాండ్లు కావాలంటూ వాటి లిస్ట్ కూడా పెడుతున్నారు. దీనికి స్పందించిన ఆనం.. త్వరలోనే అన్ని మద్యం బ్రాండ్లు దొరుకుతాయని పేర్కొన్నారు. మరోవైపు, ఇష్టమైన మద్యం మళ్లీ అందుబాటులోకి వస్తుండడంతో నెటిజన్లు మీమ్స్‌తో సెలబ్రేట్ చేసుకుంటున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com